




VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ సంపుటి : 01 సంచిక : 96 శనివారం 05 సెప్టెంబర్ 2026 పేజీలు : 8 వెల : 2/-


# కంచుకోట శ్రీశైలంలో పురపాలక పట్టు ఏ పార్టీది అధికారం

-టిడిపి జనసేన బిజెపి పార్టీ నేతలు ఉత్సాహం
-శ్రీశైలంలో కనిపించని కాంగ్రెస్ పార్టీ నాయకత్వం
-త్వరలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థ ఎన్నికలకు నేతలు సిద్ధమా
-పురపాలక సంఘం, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల కసరత్తులో ప్రజా పాలకులు
-అధికారం ప్రతిపక్ష పార్టీల నేతలతో ప్రజల ఓటు బ్యాంకు ఎవరికి
-రాజ్యాంగబద్ధంగానే ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజా నేతలు సిద్ధం

ఆత్మకూరు సెప్టెంబర్ 4 వార్త సాక్ష్యం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అతి త్వరలో జరగబోయే స్థానిక సంస్థ ఎన్నికలకు కూటమి పాలనలో జనసేన బిజెపి టిడిపి, పార్టీ నేతలు సిద్ధమవుతు న్నారా..! నువ్వా నేనా అంటూ ఎన్నికల్లో పోటీ తత్వం జరుగు తుందా లేక రాజ్యాంగబద్ధంగా ఎన్నికలు నిర్వహిం చేందుకు పాలకులు నేతలు సిద్ధంగా ఉన్నారా అనే విషయాలు తెలియాల్సి ఉంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగే ఎన్నికలకు వైసిపి టిడిపి జనసేన బిజెపి పార్టీల మధ్యలో హోరాహోరీగా ఎన్నికలు జరిగే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. - మిగతా2లో






## అక్షరాస్యతపై కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం

- ఏపీ అక్షరాస్యతపై మంత్రి లోకేశ్ ప్రకటనను తప్పుబట్టిన జగన్
- ఇది పూర్తిగా తప్పుడు సమాచారంతో కూడిన ప్రచారమని విమర్శ
- కేంద్ర ప్రభుత్వ గణాంకాలను ఉటంకిస్తూ వివరణ ఇచ్చిన మాజీ సీఎం
- ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులు తగ్గుతున్నారని ఆందోళన వ్యక్తీకరణ
- విద్యాశాఖ పై దృష్టి పెట్టాలని లోకేశ్‌కు సూచించిన జగన్

ఏపీలో అక్షరాస్యత రేటు 2024లో 72.6శాతం నుంచి 2026 నాటికి 82.1శాతానికి పెరిగిందంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రకటనపై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్ మిగతా2లో

## కేరళలో నారా లోకేశ్..



### అమృతపురిలో 'అమ్మ' ఆశీర్వాదం...

- కేరళలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్
- కొల్లం జిల్లాలోని అమృతపురి ఆశ్రమం సందర్శన
- మాతా అమృతానందమయి ఆశీస్సులు అందుకున్న లోకేశ్
- ఆశ్రమంలోని అమృత విశ్వ విద్యాపీఠాన్ని పరిశీలించిన వైనం
- ఈ పర్యటన వ్యక్తిగతమని, అధికారికం కాదని సమాచారం

2

## స్థానిక ఎన్నికలే లక్ష్యం.. ఎన్డీయే సమన్వయ కమిటీ కీలక భేటీ

- ఎన్నికల సన్నద్ధత, భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయంపై విస్తృత చర్చ
- క్షేత్రస్థాయిలో ఐక్యంగా పనిచేయాలని నాయకుల నిర్ణయం
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తీర్మానం

2





2

## ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం ఉచిత అడ్మిషన్లపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

- మార్గదర్శకాల సవరణ కోసం 16 మంది సభ్యులతో రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటు
- సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా కొత్త నిబంధనల రూపకల్పన
- ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 173 మందికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు
- సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డుల ప్రదానం



## గుంటూరు బాలిక కిడ్నాప్ కేసు..

### నిందితుడు జాన్ సైదా హర్యానాలో అరెస్ట్

- తీవ్ర కలకలం రేపిన గుంటూరు బాలిక కిడ్నాప్ కేసు
- మూడు నెలలైనా బాలిక ఆచూకీ దొరక్కపోవడంపై హైకోర్టు ఆగ్రహం
- పోలీసులకు అక్షింతలు! దాంతో ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న డీజీపీ
- సాంకేతిక ఆధారాలతో నిందితుడి ఆచూకీ గుర్తింపు

2



## ట్రంప్ దృష్టిలో మోదీ అగ్రస్థానంలో ఉంటారు

- మోదీని కలవడానికి ట్రంప్ ఆసక్తిగా ఉన్నారన్న సెర్గియో గోర్
- డిసెంబర్‌లో జీ20 సదస్సు కోసం అమెరికా పర్యటనకు మోదీ
- భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం త్వరలో ఖరారయ్యే సూచనలు

2

జీ20 సదస్సు కోసం భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా వెళ్లనున్న నేపథ్యంలో ఇరు దేశాల మధ్య కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ఎన్టీఆర్ ఆశయాలను ఆచరణలోకి తెచ్చింది చంద్రబాబే




### పేదల సంక్షేమమే ధ్యేయంగా ఎన్టీఆర్ పునాదులు వేశారన్న కాలవ శ్రీనివాసులు

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఆశయాలను నిబద్ధతతో ఆచరణలోకి తీసుకొచ్చిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు కొనియాడారు. అనంతపురంలో నిర్వహించిన మిగతా2లో

## కొడంగల్ నియోజకవర్గంలో డిగ్రీ, గురుకుల భవన నిర్మాణాలను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి



- మద్దూరు మున్సిపల్ కేంద్రంలో రేవంత్ పర్యటన
- భూములిచ్చిన దాతలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్న సీఎం

తన సొంత నియోజకవర్గ మైన కొడంగల్ పరిధిలోని మద్దూ రు మున్సిపల్ కేంద్రంలో తెలంగా ణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్య టించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో విచ్చేసిన ఆయన, మద్దూరులో రూపుదిద్దు కుంటున్న ప్రభుత్వ డిగ్రీ 2లో

వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# కంచుకోట శ్రీశైలంలో పురపాలక పట్టు ఏ పార్టీది అధికారం

ఈ నేపథ్యంలోనే నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం లో కంచుకోటలో పురపాలక పట్టు ఏ పార్టీకి దక్కుతుందో అంటూ ప్రజల్లో చర్చ నీ అంశం ప్రారంభమైంది మరోవైపు కంచుకోట కాంగ్రెస్ పార్టీకి నిలయంగా ఉన్న శ్రీశైలం నియోజకవర్గం ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ క్యాడర్ కనుచూపుమేరా కనిపించడం లేదు. ఈ పార్టీ స్థానిక సంస్థ ఎన్నికలలో గ్రామ సర్పంచులు పురపాలక సంఘం వార్డు కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, జడ్పిటిసిల స్థానాలలో పోటీకి అభ్యర్థులు నిలుస్తారా అనే విషయం నేటికీ అలాగే నిలిచింది నాలుగు పార్టీల మధ్యలో జరిగే రాజకీయంలో స్థానిక సంస్థల ఎన్నికల హడావిడి అప్పుడే ప్రారంభమైందని చెప్ప వచ్చు శ్రీశైలం నియోజకవర్గం లో గ్రామ సర్పం చులలో రిజర్వేషన్ల ప్రకారం గా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికలలో రిజర్వేషన్లు ఉంటాయి అంటూ కార్యకర్తల్లో నేతల్లో సందేహాలు మొదలయ్యాయి ఇదిలా ఉంటే పురపాలక సంఘంలో 32 వార్డులు పునర్విభజన జరగడంతో ఏ ఓటరు ఏ వార్డులోకి వెళ్ళాడు అనే విషయం వార్డు ప్రజలకు నేటికీ అర్థం కావడం లేదు సర్ ఓటర్ జాబితా ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తారా లేక పాత ఓటర్ జాబితా ప్రకారంగానే పురపాలక సంఘం గ్రామపంచాయతీ జెడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికలు నిర్వహిస్తారని విషయం తెలియాల్సి ఉంది ఒకవైపు కూటమి నేతలు పురపాలక ఎన్నికలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఓటర్ లిస్ట్ జాబితా నేతలను సందిగ్ధంలో పడేసింది త్వరలో జరగబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో శ్రీశైలం నియోజకవర్గం లో వైసిపి టిడిపి బిజెపి జనసేన పార్టీల మధ్యలో హోరాహోరీగా ఎన్నికల కొనసాగే విధంగా ఆయా పార్టీ ప్రతినిధులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు కంచుకోట కాంగ్రెస్ పార్టీకి శ్రీశైలం నియోజకవర్గం లో కనుచూపుమేరా నాయకత్వం కనిపించడం లేదు ఒక పార్టీ క్యాడర్ కోసం పనిచేస్తుంటే మరో పార్టీ నేతల ఉనికి కోసం పాటుపడుతున్నారు మరి కొన్ని పార్టీలకు నాయకత్వం లేక తెరమీద మేమున్నామంటూ ప్రజల్లో జెండాలు పట్టుకొని తిరుగుతున్నారు పురపాలక సంఘం పోరులో కీలకంగా జరిగే ఎన్నికల్లో ఏ పార్టీ పీఠం దక్కించుకుంటుందని ప్రజల్లో ఉత్కంఠ గా చర్చలు ఇప్పటినుంచే కొనసాగుతున్నాయి నాలుగు పార్టీలలో జరిగే అసంతృప్తి రాజకీయాలను నేతలు ముందుగానే పసి కడతారా లేక ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా మాకేమని వదిలేస్తారా అనే విషయాన్ని వేచి చూద్దాం

## అక్షరాస్యతపై కూటమి ప్రభుత్వం తప్పుడు ప్రచారం

ఏపీలో అక్షరాస్యత రేటు 2024లో 72.6శాతం నుంచి 2026 నాటికి 82.1శాతానికి పెరిగిందంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రకటనపై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్ తీవ్రంగా స్పందించారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని చూసి తాను దిగ్భ్రాంతికి గురయ్యానని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 2026 క్యాలెండర్ సంవత్సరం ఇంకా పూర్తి కానందున, అక్షరాస్యతకు సంబంధించి ఏ అధికారిక సంస్థ కూడా గణాంకాలను విడుదల చేయలేదని జగన్ స్పష్టం చేశారు. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖకు చెందిన ఎన్ఎస్ఎస్ఓ విడుదల చేసిన 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే' (పీఎల్ఎఫ్ఎస్) 2023-24 వార్షిక నివేదికను ఆయన ఉటంకించారు. దాని ప్రకారం.. 2023 జూన్ నుంచి 2024 జూన్ మధ్య కాలంలో ఏపీలో ఏడేళ్లకు పైబడిన వారిలో అక్షరాస్యత 72.6శాతంగా ఉందని, ఇదే 2018-19లో 69.1శాతంగా ఉండేదని గుర్తుచేశారు. అంతేకాకుండా, 2026 జులై 2న ప్రచురించిన పీఎల్ఎఫ్ఎస్ 2025 నివేదిక ప్రకారం.. 2025 జనవరి నుంచి 2025 డిసెంబర్ మధ్య కాలంలో రాష్ట్ర అక్షరాస్యత 71.4శాతంగా నమోదైందని తెలిపారు. వాస్తవాలు ఇంత స్పష్టంగా ఉన్నప్పుడు, ప్రభుత్వం తప్పుడు వాదనలతో ప్రజలను మభ్యపెట్టాలని చూడటం అత్యంత దురదృష్టకరమని జగన్ వ్యాఖ్యానించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గి, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలు పెరుగుతున్నాయని కేంద్ర విద్యాశాఖకు చెందిన యూడీఐఎస్ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయని, ఇది ఆందోళన కలిగించే విషయమని జగన్ అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్యను మరింత అందుబాటులోకి ఎలా తీసుకురావాలనే దానిపై దృష్టి పెట్టాల్సింది పోయి, టీడీపీ కూటమి ప్రభుత్వం మోసపూరిత వ్యూహాలతో తప్పుడు ప్రచారాలు చేసుకోవడంలో నిమగ్నమైందని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి తన శాఖపై ఎక్కువ సమయం కేటాయించాలి కానీ 'రెడ్ బుక్ గవర్నెన్స్' మీద కాదని లోకేశ్‌కు హితవు పలికారు.

# రాజమండ్రిలో సగం కాలుష్యానికి కారణం ఇదే

రాజమండ్రిలోని ఆంధ్ర పేపర్ లిమిటెడ్ (ఏపీఎల్) తీరుపై రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పుష్కర కాలంగా పన్నులు ఎగవేస్తూ, మరోవైపు గోదావరి నదిని తీవ్రంగా కలుషితం చేస్తూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తోందని ఆయన విరుచుకుపడ్డారు. రాజమండ్రిలో సగం కాలుష్యానికి ఈ కంపెనీయే కారణమని ఆరోపించారు. పద్ధతి మార్చుకోకపోతే పరిశ్రమ కార్యకలాపాలను నిలిపివేయడం దగ్గర నుంచి లైసెన్సు రద్దు వరకు ఎలాంటి కఠిన చర్యలకైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీ చేసి, తక్షణమే చర్యలు చేపట్టాలని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులను ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్నందున పరిశ్రమ కార్యకలా పాలను నిలిపివేయడం, జరిమానాలు విధించడం, కంపెనీని సీజ్ చేయడం, లైసెన్సును రద్దు చేయడం వంటి కఠిన చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. అయితే, పరిశ్రమలను ఇబ్బంది పెట్టకూడదనే ఉద్దేశంతోనే సంకీర్ణ ప్రభుత్వం ముందుగా షోకాజ్ నోటీసులు జారీ చేసి, తప్పు సరిదిద్దుకునే అవకాశం ఇచ్చిందని తెలిపారు. గత మూడు నెలలుగా పీసీబీ అధికారులు సంస్థ ప్రతినిధులతో పలుమార్లు చర్చించినా స్పందన కరువైందని అన్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే సమన్లు జారీ చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి కేసుల విచారణను వేగవంతం చేసేలా చూడాలని అడ్వకేట్ జనరల్, అదనపు ఏజీ, ఇతర ప్రభుత్వ న్యాయవాదులకు సూచించారు. 'స్వచ్ఛ గోదావరి - పవిత్ర పుష్కరాలు' నినాదంతో గోదావరి పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు పర్యావరణ వేత్తలు, పౌర సమాజం మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ప్రజల ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణకే తమ ప్రభుత్వ ం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

## కేరళలో నారా లోకేశ్.. అమృతపురిలో 'అమ్మ' ఆశీర్వాదం...

ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం కేరళలో పర్యటించారు. కొల్లం జిల్లాలోని ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రమైన మాతా అమృతానందమయి (అమ్మ) ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మను దర్శించుకుని ఆమె ఆశీస్సులు అందుకున్నారు. ఇది పూర్తిగా లోకేశ్ వ్యక్తిగత పర్యటన అని, అధికారిక కార్యక్రమం కాదని తెలుస్తోంది.దొ అమృతపురిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆశ్రమంలో లోకేశ్ దాదాపు మూడు గంటల పాటు గడిపారు. ఆశ్రమ ప్రాంగణంలో ఉన్న కాళీమాత ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మను కలుసుకుని ఆశీర్వాదం పొందారు. ఆశ్రమంలోని గజరాజులకు పండ్లు అందించారు. ఈ పర్యటన తనకు ఎంతో ఆధ్యాత్మిక సంతృప్తినిచ్చిందని లోకేశ్ పేర్కొన్నారు. తన పర్యటనకు సంబంధించిన వివరాలను ఆయన తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు.

## స్థానిక ఎన్నికలే లక్ష్యం.. ఎన్డీయే సమన్వయ కమిటీ కీలక భేటీ

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఎన్డీయే కూటమి సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో భాగస్వామ్య పక్షాల సమన్వయ కమిటీ కీలక సమావేశం నిర్వహించింది. ఎన్నికల వ్యూహాలు, క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన కార్యాచరణపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఎన్నికల సన్నద్ధత, భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం, నాయకులు-కార్యకర్తల మధ్య ఐక్యత వంటి అంశాలు ఈ భేటీలో ప్రధాన అజెండాగా ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థుల విజయాన్ని లక్ష్యంగా చేసుకుని పక్కా కార్యాచరణతో ముందుకు సాగాలని నాయకులు నిర్ణయించారు. గ్రామ, మండల స్థాయిలలో కూటమి నేతలంతా సమన్వయంతో పనిచేయాలని తీర్మానించారు.

## కొడంగల్ నియోజకవర్గంలో డిగ్రీ, గురుకుల భవన నిర్మాణాలను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి



తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ పరిధిలోని మద్దూరు మున్సిపల్ కేంద్రంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో విచ్చేసిన ఆయన, మద్దూరులో రూపుదిద్దుకుంటున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గురుకుల భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో స్వయంగా తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాల భవనాన్ని మార్చి నెలలోగా వేగవంతంగా పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులకు తరగతులు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణాల పురోగతిని పరిశీలించిన రేవంత్ రెడ్డి... కళాశాల ప్రాంగణాన్ని మరింత విశాలంగా తీర్చిదిద్దేందుకు పక్కనే ఉన్న స్థలాన్ని వెంటనే సర్వే చేసి భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంకను ఆదేశించారు. ఇదే సమయంలో గురుకుల భవన నిర్మాణానికి తమ అమూల్యమైన సొంత భూములను ఉచితంగా అందించిన దాతల ఉదారతను అభినందిస్తూ, వారికి వెంటనే 'ఇందిరమ్మ ఇళ్లు' మంజూరు చేయాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. నిర్మాణ పనుల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు.

# ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం ఉచిత అడ్మిషన్లపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం అమలుకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లను నిరుపేద విద్యార్థులకు ఉచితంగా కేటాయించాల్సి ఉండగా, ఈ విధానంలో ఉన్న మార్గదర్శకాలను సవరించి, పటిష్ఠంగా అమలు చేసేందుకు ఒక రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఈ రిజర్వేషన్ ఫలాలు పూర్తిస్థాయిలో అందేలా చూడటమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై లోతుగా అధ్యయనం చేసేందుకు 16 మంది సభ్యులతో కూడిన కమిటీని ప్రభుత్వం నియమించింది. పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా ఈ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరించనుండగా, సమగ్రశిక్షా ఎస్పీడీ కన్వీనర్‌గా ఉంటారు. వీరితో పాటు విద్యార్థుల తల్లిదండ్రుల ప్రతినిధులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు కూడా ఈ కమిటీలో స్థానం కల్పించారు. ఈ ఏడాది జనవరిలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ జారీ చేసిన ఆదేశాల నేపథ్యంలో ప్రస్తుత నిబంధనలను సవరించి, పకడ్బందీగా అమలు చేసేందుకు ఈ కమిటీ కృషి చేస్తుందని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కమిటీ త్వరలోనే సమావేశమై కొత్త మార్గదర్శకాలను ప్రభుత్వానికి సిఫార్సు చేయనుంది.

**173 మందికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు**

మరోవైపు రేపు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విశేష సేవలు అందించిన వారికి 'రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు-2026'ను ప్రకటించింది. మొత్తం 173 మందిని ఈ పురస్కారాలకు ఎంపిక చేసింది. వీరిలో పాఠశాల విద్యా విభాగం నుంచి 79 మంది, ఇంటర్ విద్య నుంచి 24 మంది, సాంకేతిక విద్య నుంచి 14 మంది, ఉన్నత విద్యా విభాగం నుంచి 56 మంది ఉన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా వీరికి ప్రశంసాపత్రం, జ్ఞాపిక, పతకం, శాలువాతో పాటు రూ. 20 వేల నగదు బహుమతిని అందించి ఘనంగా సత్కరించనున్నారు.

# ట్రంప్ దృష్టిలో మోదీ అగ్రస్థానంలో ఉంటారు..

జీ20 సదస్సు కోసం భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా వెళ్లనున్న నేపథ్యంలో ఇరు దేశాల మధ్య కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. మోదీని కలవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎంతగానో కోరుకుంటున్నారని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. డిసెంబర్‌లో ఫ్లోరిడాలో జరిగే జీ20 సదస్సు కేవలం బహుపాక్షిక సమావేశాలకే పరిమితం కాకపోవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. ట్రంప్ దృష్టిలో మోదీ స్నేహితుడని, 35 మంది నేతలు వస్తే ఎవరిని కలవాలనుకుంటారని అడిగితే.. మోదీ ఆయన జాబితాలో అగ్రస్థానంలో ఉంటారని గోర్ చెప్పారు. 2020లో భారత పర్యటనను ట్రంప్ ఇప్పటికీ ఎంతో ఇష్టంగా గుర్తుచేసుకుంటున్నారని, వచ్చే ఏడాది ఆయన భారత్‌కు వచ్చే అవకాశం కూడా ఉందని సంకేతాలు ఇచ్చారు. అమెరికా-భారత్ సంబంధాలు ఇతర దేశాలు అసూయపడే రీతిలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై కూడా గోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు తర్వాత చర్చలను మళ్లీ కొనసాగిస్తున్నామని, ఒప్పందం "చాలా దగ్గర్లోనే ఉంది" అని తెలిపారు. రాబోయే కొన్ని నెలల్లో ఒప్పందం ఖరారవుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 240 బిలియన్ డాలర్లు ఉండగా.. దీన్ని 500 బిలియన్ డాలర్లకు పెంచాలని మోదీ, ట్రంప్ లక్ష్యంగా పెట్టుకున్నారు.

**భారత స్థిరత్వం కీలకం**

భారత్ ఆర్థికంగా బలపడటం అమెరికాకు కూడా ప్రయోజనకరమని గోర్ అన్నారు. మోదీ దేశానికి స్థిరత్వాన్ని అందిస్తున్నారని ప్రశంసించారు. అమెరికా కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెంచుతున్నాయని, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థలు డేటా సెంటర్లు, ఏఐ కేంద్రాలు, ఔషధ రంగాల్లో విస్తరిస్తున్నాయని చెప్పారు. అమెరికాలోకి కొత్తగా 24 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడంలోనూ రాయబార కార్యాలయం సహకరించిందన్నారు.

## ఎన్టీఆర్ ఆశయాలను ఆచరణలోకి తెచ్చింది చంద్రబాబే

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఆశయాలను నిబద్ధతతో ఆచరణలోకి తీసుకొచ్చిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు కొనియాడారు. అనంతపురంలో నిర్వహించిన పార్టీ శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పేదల సంక్షేమం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, ఆత్మగౌరవ పాలనే ధ్యేయంగా ఎన్టీఆర్ వేసిన పునాదులపైనే చంద్రబాబు నేడు సంక్షేమం, అభివృద్ధిని సమతుల్యం చేస్తూ పరిపాలన సాగిస్తున్నారని స్పష్టం చేశారు. తెలుగుజాతి వికాసం కోసం ఎన్టీఆర్ కన్న కలలను నెరవేర్చేందుకు చంద్రబాబు నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన వ్యవస్థలను ప్రక్షాళన చేస్తూ, ప్రతి పేద కుటుంబానికి అండగా నిలిచేలా 'దీపం' పథకం ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, కొత్త పింఛన్ల మంజూరు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటోందని వెల్లడించారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకు పునరంకితం అవుతూ, పార్టీ శ్రేణులంతా ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.

## గుంటూరు బాలిక కిడ్నాప్ కేసు..

గుంటూరు బాలిక కిడ్నాప్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన షేక్ జాన్ సైదాను పోలీసులు హర్యానాలో అరెస్ట్ చేశారు. మూడు నెలలుగా బాలిక ఆచూకీ లభించకపోవడంపై హైకోర్టు తీవ్రంగా స్పందించిన నేపథ్యంలో, పోలీసులు ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిందితుడిని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే, గుంటూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 15 ఏళ్ల బాలికను షేక్ జాన్ సైదా (రబ్బానీ) ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం పెంచుకుని, మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడు. తన కుమార్తె అపహరణకు గురైందని, ఆమెను తమకు అప్పగించేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ బాలిక తండ్రి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ తుహిన్ కుమార్ ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టింది. మూడు నెలలు గడిచినా బాలిక ఆచూకీ కనిపెట్టలేకపోవడం పోలీసుల వైఫల్యమేనని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "ఇలాంటి పోలీసులు ఉండటం ప్రభుత్వానికి సిగ్గుచేటు" అంటూ ఘాటైన వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్‌ను పోలీస్ స్టేషన్‌లోకి రాకుండా అడ్డుకోవడంలో చూపిన శ్రద్ధ, బాలికను రక్షించడంలో ఎందుకు చూపలేకపోయారని న్యాయస్థానం పోలీసుల తీరును తప్పుబట్టింది. ఈ కేసు దర్యాప్తులో స్థానిక పోలీసులపై తమకు నమ్మకం లేదని స్పష్టం చేసిన ధర్మాసనం, బాలికను గురువారం కోర్టులో హాజరుపరచాలని నేరుగా ఏపీ డీజీపీకి ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఇంత తీవ్రంగా స్పందించడంతో, డీజీపీ సిట్ నియామకం జరిపారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. ఈ క్రమంలోనే, సాంకేతిక ఆధారాలతో నిందితుడు జాన్ సైదా హర్యానాలో ఉన్నట్లు గుర్తించి, అక్కడికి వెళ్లి అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని, బాలికను గుంటూరుకు తరలించే ప్రక్రియను పోలీసులు ప్రారంభించారు.

VARTHAA SAKSHAMU
వార్త
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# సంపాదకీయం

## హిందువుల ఐక్యతే వీహెచ్‌పీ లక్ష్యం



హిందూ సమాజాన్ని సంఘటితం చేసి, సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేయాలనే మహోన్నత సంకల్పంతో విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆవిర్భవించింది. శ్రీకృష్ణ జన్మాష్టమి పవిత్ర పర్వదినంతో ముడిపడి ఉన్న విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావ దినోత్సవం ప్రతి హిందువులోనూ ధర్మచైతన్యాన్ని మేల్కొలిపే సందర్భం. ధర్మం కోసం నిలబడటం, సమాజాన్ని సంఘటితం చేయడం, బలహీనులకు అండగా నిలవడం, సత్యాన్ని కాపాడటం ప్రతి హిందువు బాధ్యత అనే స్ఫూర్తిని ఈ ఆవిర్భావ దినోత్సవం మనకు గుర్తుచేస్తున్నది. 1964లో ముంబైలో సాధుసంతులు, ధార్మిక పెద్దలు, సామాజిక నాయకులు కలిసి విశ్వహిందూ పరిషత్‌కు పురుడుపోశారు. భిన్నమైన మతాలు, పీఠాలు, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక సంస్థలు, సాధుసంతులను ఒకే వేదికపైకి తీసుకురావడం వెనుక ఉన్న ఆలోచన అత్యంత విశాలమైనది. దేశంలోని హిందువులందరినీ ఒకే సంప్రదాయంలోకి తీసుకురావడం కాదు.. భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుతూ 'మనమంతా హిందూ సమాజానికి చెందినవారమే' అనే ఆత్మీయ భావనను బలపరచడం విశ్వహిందూ పరిషత్ ప్రధాన లక్ష్యం. సాధుసంతుల మార్గదర్శకత్వం, సమాజంలోని వివిధ వర్గాల సహకారం, కార్యకర్తల అంకితభావంతో వీహెచ్‌పీ తన ప్రస్థానాన్ని విస్తరించుకుంటూ వస్తోంది. హిందూ సమాజ చైతన్య ప్రస్థానంలో అయోధ్య శ్రీరామ జన్మభూమి ఉద్యమం ముఖ్యమైన ఘట్టం. శ్రీరామ జన్మభూమిలో భవ్యమైన శ్రీరామ మందిరం నిర్మించాలనే ఆకాంక్షను దేశవ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విశ్వహిందూ పరిషత్ ప్రముఖపాత్ర పోషించింది. దీర్ఘకాలిక న్యాయ, సామాజిక, ప్రజా ప్రక్రియల అనంతరం అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం సాకారం కావడం కోట్లాది హిందువుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచింది. విశ్వహిందూ పరిషత్ దశాబ్దాలుగా సేవ, సంస్కారం, సమరసత, ధర్మజాగరణ, గోరక్షణ, దేవాలయ పరిరక్షణ, సామాజిక చైతన్యం వంటి అనేక రంగాల్లో పనిచేస్తోంది. సమాజంలో అవసరమైన వర్గాలకు విద్య, వైద్యం, సేవా కార్యక్రమాలు అందించడం, గిరిజన మారుమూల ప్రాంతాల్లో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం వీహెచ్‌పీ ప్రధాన బాధ్యత. విపత్తుల సమయంలో బాధితులకు సహాయం చేయడం వంటి కార్యక్రమాల ద్వారా పరిషత్ సేవా భావాన్ని ముందుకు తీసుకెళ్తోంది. హిందూ సమాజంలో ఏ వర్గం వెనుకబడినా అది మొత్తం సమాజం వెనుకబడినట్లేననే భావనతో సామాజిక సమరసతకు ప్రాధాన్యం ఇవ్వడం అవసరం. కుల, ప్రాంత, భాషా భేదాలకు అతీతంగా ప్రతి హిందువూ పరస్పరం సోదరభావంతో మెలగాలి. ఇదే సనాతన ధర్మం మనకు నేర్పే మానవీయ విలువ. నేడు హిందువులు ప్రపంచంలోని అనేక దేశాల్లో నివసిస్తున్నారు. విదేశాల్లో జన్మించిన హిందూ యువతరానికి భారతీయ సంస్కృతి, కుటుంబ విలువలు, పండుగలు, సంప్రదాయాలు, దేవాలయాలు, ధార్మిక వారసత్వం గురించి అవగాహన కల్పించడం ఒక ముఖ్యమైన బాధ్యత. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ సమాజాన్ని అనుసంధానించే వేదికగా విశ్వహిందూ పరిషత్ పాత్ర మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకుంటోంది. 'ప్రపంచంలో ఎక్కడ హిందువు ఉన్నా.. అతని సాంస్కృతిక మూలాలు భారతీయ సనాతన సంప్రదాయంతో అనుసంధానమై ఉండాలి' అనే భావనను బలపరచడం అవసరం. భారత భవిష్యత్తు యువత చేతుల్లో ఉంది. సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక విద్యతో పాటు మన సంస్కృతి, చరిత్ర, కుటుంబ విలువలు, దేశభక్తి, సేవాభావం, ధర్మబద్ధమైన జీవన విధానం గురించి కూడా యువత తెలుసుకోవాలి. ధర్మం అంటే కేవలం దేవాలయానికి వెళ్లడం లేదా పూజలు చేయడం మాత్రమే కాదు. ధర్మం అంటే సత్యం, న్యాయం, కర్తవ్యం, సేవ, త్యాగం, పరస్పర గౌరవం, సమాజం పట్ల బాధ్యత. ఈ విశాలమైన ధర్మ భావనను యువతలో పెంపొందించడమే నేటి అవసరం. హిందూ సమాజంలోని ప్రతి కుటుంబం ధర్మం పట్ల అవగాహన కలిగి ఉండాలి. ప్రతి గ్రామంలో ధర్మచైతన్యం పెరగాలి. ప్రతి యువకుడిలో సేవాభావం పెంపొందాలి. ప్రతి కుటుంబంలో సంస్కారం బలపడాలి. ప్రతి హిందువు మరో హిందువును తన సోదరుడిగా భావించే పరిస్థితి ఏర్పడాలి. శ్రీకృష్ణుడు గీతలో చేసిన కర్తవ్యబోధనే మనకు మార్గదర్శకం. ధర్మం కోసం పనిచేసే ప్రతి వ్యక్తి, సమాజ సేవలో పాల్గొనే ప్రతి కార్యకర్త, సంస్కృతి పరిరక్షణకు కృషి చేసే ప్రతి కుటుంబం... హిందూ సమాజ భవిష్యత్తుకు ఒక బలమైన పునాది. ఈ పవిత్ర శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా, విశ్వహిందూ పరిషత్ 62వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని "హిందవః సోదరాః సర్వే" (హిందువులందరూ సోదరులే) అనే భావంతో హిందూ సమాజం మరింత సంఘటితం కావాలని, సనాతన ధర్మం శాశ్వత విలువలను ప్రపంచానికి మరింత బలంగా చాటాలని మనమందరం సంకల్పిద్దాం.

# ప్రజాస్వామ్యానికి శక్తులు ఉడిగాయా? ఉన్నాయా?




క్రమబద్ధంగా జరిగే ఎన్నికలూ, అధిక సంఖ్యలో పాల్గొనే ఓటర్లూ, శాంతియుతంగా ప్రభుత్వాలు మారటాలూ.. ప్రజాస్వామ్యమంటే ఇదే అను కుంటాం. ఇలా చూస్తే మన ప్రజాస్వామ్యం ప్రపంచంలోనే ఘనమైందిగా కనిపిస్తుంది. ఏ దేశమూ మనకు సాటిరానిది గానే అనిపిస్తుంది. దీన్నే అసలుసిసలైన ప్రజాస్వామ్యంగా భావిస్తే అందరికంటే ర్యాంకుల్లో మనమే ముందుంటాం. కానీ వీ--డెమ్ (వెరైటీస్ ఆఫ్ డెమొక్రసీ) ఇనిస్టిట్యూట్ తాజాగా మన ప్రజాస్వామ్యానికి ఇచ్చిన ర్యాంకు చాలా దయనీయంగా ఉంది. 179 దేశాల్లో భారత్‌కు 106వ స్థానం లభించింది. కిందటి ఏడాది 100వ ర్యాంకు ఉంటే అది ఈ ఏడాది 106కు పడిపోయింది. అన్నిరకాల ప్రాథమిక హక్కులను హరించివేసిన 1975 నాటి ఎమర్జన్సీ కాలం తర్వాత దేశంలో ప్రజాస్వామ్యం ఇంతటి దుస్థితికి దిగజారటం ఇప్పుడేనని వీ--డెమ్ నివేదిక పేర్కొంది ఎన్నికల ద్వారా అధికారాన్ని కైవసం చేసుకునే పార్టీలూ, నేతలూ నియంతృత్వ పోకడలను ప్రదర్శిస్తూ, అసమ్మతిని నయానాభయానా అణచి, వ్యవస్థలన్నిటినీ నిర్వీర్యం చేసి.. తమకు ఎదురులేని రీతిలో వ్యవహారాలను నడపటాన్ని 'ఎలక్టోరల్ అటోక్రసీ'గా వర్ణించటం ఇటీవల కాలంలో బాగా పెరిగింది. భారత్‌ను ఆ కోవలోకి చేర్చటమే కాదు... తాజా నివేదికలో మన దేశాన్ని పాకిస్థాన్, కజకిస్థాన్ సరసన వీడెమ్ నివేదిక నిలబెట్టింది. న్యాయవ్యవస్థలో జవాబుదారీతనం లోపించటం, ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తితో వ్యవహరించలేకపోవటం, ప్రభుత్వ యంత్రాంగంలో నిష్పాక్షికత గణనీయంగా క్షీణించటం అనేవి ఒక ప్రజాస్వామ్య దేశంగా భారత్ ర్యాంకు పడిపోవటానికి కారణాలుగా వీ--డెమ్ వ్యాఖ్యానించింది. భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు అడ్డంకులూ, పౌరసమాజానికి తన గళం వినిపించటంలో వివిధ రూపాల్లో ఎదురయ్యే ఇబ్బందులూ భారత ప్రజాస్వామ్య నాణ్యతను బాగా దెబ్బతీశాయని కూడా విమర్శించింది. ఎలక్టోరల్ అటోక్రసీ మీదే గాక, 'డెమొక్రటిక్ బ్యాక్‌స్లైడింగ్' అనే పేరు మీద కూడా ఇటీవల కాలంలో చాలా రచనలు వచ్చాయి. ఎలక్టోరల్ అటోక్రసీ అన్నా, డెమొక్రటిక్ బ్యాక్‌స్లైడింగ్ అన్నా అర్థంలో పెద్దగా తేడాలేదు. ప్రజాస్వామ్యం అన్ని విధాలుగా దిగజారి ఆలోచనల్లో ఆచరణలో నియంతృత్వ ధోరణులు పెరుగుతున్నాయని చెప్పటానికే ఆ రెండు పదబంధాలను వాడుతున్నారు .ప్రజాస్వామ్య క్షీణతా, నియంతృత్వ ధోరణుల పెరుగుదల ప్రపంచవ్యాప్తంగా ప్రబలం అవుతుంటే, వాటి తాలూకూ విపరిణామాల వల్ల నష్టపోయేది సాధారణ ప్రజలే. ముఖ్యంగా పెద్దగా ఆస్తిపాస్తులూ లేకుండా వేతనాల మీద ఆధారపడేవారే అందులో ప్రధానంగా ఉంటారు. సంపదలో, ఆదాయంలో వాటా తక్కువగా ఉన్నవాళ్లే గొంతెత్తాల్సి వస్తుంది. అలా ఎత్తే అవకాశాలను తగ్గించటం ప్రజాస్వామ్య దేశాల్లో కూడా ఎక్కువవుతోంది. ఆర్థిక అంతరాలు విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో మత, జాతి విద్వేషాల చుట్టూ ప్రజలను ఊపేసే నాయకులు రంగం మీదకు వస్తారు. వీళ్లందరూ ఎన్నికల్లో మెజారిటీ జనాభిమానం పొందుతారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్యాన్ని లోపల నుంచీ బలహీన పరుస్తారు. 2000 సంవత్సరం తర్వాత అన్ని దేశాల్లో ఆర్థిక అంతరాలు విపరీతంగా పెరిగాయి. వీటితోపాటే అరచేతిలో వైకుంఠాన్ని చూపిస్తామనే జనాకర్షక నేతల ప్రాబల్యమూ పెరిగింది. భారత్ లాంటి దేశాల్లోనే కాదు... అమెరికాలో సైతం ప్రజాస్వామ్య క్షీణతపై ఆలోచనాపరుల్లో భయం పట్టుకుంది. డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని ప్రజాస్వామ్య వ్యవస్థలను బహిరంగంగా తూలనాడటం, ఫలానా విధంగా తీర్పులు ఇవ్వాలని న్యాయస్థానాలను హెచ్చరించటం, చట్టసభలను ఖాతరు చేయకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవటం లాంటివి ప్రపంచ దేశాలన్నిటి మీదా ప్రభావం చూపుతున్నాయి. అన్నింటా అమెరికా వైపుచూసే వివిధ దేశాల్లోని పాలకులకు తాము ఆ దారిలో ఇంకా ఎక్కువ వేగంగా అడుగులు వేసేలా అవి ప్రేరణను ఇస్తున్నాయి. ప్రజాస్వామ్యానికి అన్ని వైపుల నుంచి ఇలా సమస్యలు చుట్టుముడుతున్న నేపథ్యంలో దాని మనుగడపైనే సందేహాలు తలెత్తుతు న్నాయి. ఆర్థికశాస్త్రంలో రెండేళ్ల క్రితం నోబుల్ బహుమతి పొందిన డరాన్ అసెమోగ్లూ ఈ సమస్యలన్నిటినీ విశ్లేషిస్తూ 'ఉదారవాద ప్రజాస్వా మ్యానికి ఏమైంది?' అంటూ తాజాగా ఒక సమగ్ర పుస్తకాన్ని ప్రచురించారు. ప్రజాస్వామ్యం నిలబడా లంటే ఏం చేయాలన్నదే ఆయనకు ప్రధానం కాబట్టి ఆ కోణంలోనే కొన్ని ప్రతిపాదనలు చేశారు. ఆధునిక రాజకీయాల్లో ప్రజాస్వామ్యాన్ని అత్యుత్తమ వ్యవస్థగా, జీవన విధానంగా భావించే వారికి ఆయన ప్రతిపాదనలు ఆలోచనాత్మకంగా ఉంటాయి. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే దాన్ని మళ్లీ సాధారణ ప్రజల జీవితాలను మెరుగుపరచేలా చేయగలగాలి. దాన్నే ఆయన 'వర్కింగ్ క్లాస్ లిబరలిజం'గా వర్ణించారు. అమెరికా, పశ్చిమయూరపు దేశాల్లో రెండో ప్రపంచయుద్ధం ముగిసిన నాటి నుంచి దాదాపు 30 ఏళ్లు ప్రజల జీవనప్రమాణాలు విశేషంగా మెరుగుపడ్డాయి. ఆర్థికరంగాన్నీ, ప్రజల, కార్మికుల బాగోగులనూ మార్కెట్ శక్తులకే వదలివే యకుండా ప్రభుత్వాలు జాగ్రత్తలు తీసుకున్నాయి. ప్రజల సామాజిక, ఆర్థిక సంక్షేమాన్ని పాలనకు ముఖ్య కర్తవ్యంగా భావించాయి. ఈ కారణంగానే ప్రజలు ఉదార ప్రజాస్వామ్యంలో నమ్మకాన్ని పెంచుకున్నారు. ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ తమకు అండగా ఉంటుందని భావించారు. 1950ల తర్వాత పరిశ్రమలు పెరిగాయి. ఉద్యోగాలు పెరిగాయి. కార్మికుల జీతాలు పెరిగాయి. మధ్య తరగతి విస్తరించింది. ప్రభుత్వసేవలు మెరుగ య్యాయి. విద్య, ఆరోగ్య రంగాల్లో ఎంతో పురోగతి సాధ్యమైంది. ఆర్థికాభివృద్ధి ఫలితాలు అన్నివర్గాల ప్రజలకూ చేరటం వల్ల 'ఈ వ్యవస్థలో నాకూ స్థానం ఉంది' అన్న భావన ప్రజల్లో బలపడింది. ఒకప్పుడు స్వేచ్ఛకూ, ప్రజాస్వామ్యానికీ, ఆర్థికాభివృద్ధికీ విజయవంతమైన నమూనాగా లిబరల్ డెమొక్రసీ కనపడింది. ఇప్పుడు దానికి గండిపడింది. ప్రజలతో ఆర్థిక, రాజకీయ సంబంధాన్ని క్రమంగా డెమొక్రసీ కోల్పోయింది. ఇది ఒక్కసారిగా జరగలేదు. 1980ల తర్వాత మొదలై 2000ల తర్వాత తీవ్రమైంది. 'మా ఉద్యోగాలు భద్రంగా లేవు. మా ఆదాయం పెద్దగా పెరగటం లేదు. మా పిల్లల భవిష్యత్తు మాకంటే మెరుగ్గా ఉంటుందన్న నమ్మకం కలగటం లేదు. రాజకీయ నాయకులు మా వినతులను వినటం లేదు. దేశం అభివృద్ధి అవుతోంది. కానీ ఆ ప్రయోజనం మాకు తగినంతగా దక్కటం లేదు' అన్న మాటలు సగటు మనుషుల నుంచి వినిపించటం ఇప్పుడు సాధారణమైంది. 'ప్రతి వ్యక్తికీ తనకు నచ్చినట్లు జీవించే స్వేచ్ఛ ఉంది'.. లిబరలిజం అంటే అంతకు మించి ఏముంటుంది? అని అనుకుంటే సంక్షోభం అర్థంకాదు. నచ్చినట్లు జీవించే స్వేచ్ఛ ఉండటం వల్ల జీవన ప్రమాణాలు వాటంతట అవే పెరగవు. స్వేచ్ఛను ఉపయోగించుకుని మెరుగైన జీవితాన్ని ఏర్పరచుకునే పరిస్థితులనూ, అవకాశాలనూ ప్రభుత్వాలు సృష్టించాలి. ఒకప్పుడు లక్షలాది కార్మికుల అవసరం ఉండేది. కార్మికులు కూడా సంఘటితంగా ఉండి డిమాండ్లు సాధించుకునేవారు. ఎక్కువ జీతాల కోసం పోరాడగలిగేవారు. వారికి రాజకీయ ప్రాధాన్యత ఉండేది. ఇప్పుడన్నీ పోయాయి. ఆటోమేషన్ పెరిగింది. ఫ్యాక్టరీలు కనుమరు గయ్యాయి. కార్మిక సంఘాలు బలహీనప డిపోయా యి. 1990ల తర్వాత (పోస్ట్ ఇండస్ట్రియల్) బాగా ఉన్నత చదువులు చదివిన వారికీ, టెక్నాలజీ నిపుణులకూ ప్రాధాన్యం పెరిగింది. ఉద్యోగాలన్నీ ఫైనాన్స్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఐటీ రంగాలకు తరలిపోయాయి. సాధారణ చదువులు చదివినవారు వెనుకబడిపోయారు. వేతనాల్లోనూ విపరీత వ్యత్యాసాలు పెరిగాయి. సంప్రదాయ పరిశ్రమలు, రంగాలపై ఆధారపడినవాళ్లు స్థిరత్వాన్ని కోల్పో యారు. అందుకే కొద్ది ఉద్యోగాలను మాత్రమే కల్పించే విధానాలకు పెద్దపీట వేసిన నిపుణుల పట్ల వ్యతిరేకత ప్రబలింది. రాజకీయాల్లోనూ ఉన్నతవర్గాల ప్రాబల్యం పెరిగింది. వీరందరిపై మధ్య, కింది వర్గాల ప్రజల్లో ఉన్న అసంతృప్తిని ఉపయోగించుకుని ట్రంప్ లాంటి నేతలు అధికారంలోకి వచ్చారు. ఉద్యోగ అవకాశాలు లేకుండా చేస్తున్న విధానాల పైనా, వాటి సృష్టికర్తపైనా పోరాడుతున్నామంటూ ఉద్రేక ప్రసంగాలు చేసి ఎన్నికల్లో గెలిచారు. ఐటీ విప్లవం, ఆటోమేషన్ కలిగించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాల నుంచి కృత్రిమమేధ (ఏఐ) కూడా ప్రజలను గట్టెక్కించలేదు. ఏఐని ఎవరికి ఉపయోగపడేలా అభివృద్ధి చేస్తున్నారో పరిశీలిస్తే కానీ దాని ప్రభావం అర్థంకాదు. కార్మికులను తొలగి ంచటం, నిరుద్యోగ భయాన్ని మరింత పెంచటం, వీటితో పాటు అసమానతలు మరింత హెచ్చేలా చేయటం... ఏఐ వల్ల జరిగితే సంక్షోభం యథా తథంగా ఉంటుంది. ప్రజాస్వామ్యంలో నమ్మకం మరింతగా సడలిపోతుంది. ప్రస్తుత రాజక ీయ వ్యవస్థ తమకు ఏమీ చేయటం లేదన్న భావనను మరింత ఎక్కువ చేస్తుంది. లిబరల్ డెమొక్రసీని కాపాడుకోవాలంటే అది మళ్లీ సాధారణ ప్రజల జీవితాల మెరుగుదలకు తోడ్పడాలి. గౌరవంగా జీవించగల ఉద్యోగాలను కల్పించాలి. ఏమీ చేయలేని అశక్తులుగా ఉద్యోగులను మార్చ కూడదు. అభివృద్ధి ఫలాలు (షేర్డ్ ప్రాస్పరిటీ) విస్తృతంగా ప్రజలకు చేరాలి. విధాన నిర్ణయాల్లో కేంద్రీకరణకు స్వస్తిప లకాలి. ఒక్కమాటలో చెప్పుకోవాలంటే ప్రజలకు సామాజిక, ఆర్థిక, ఉద్యోగ భద్రతనూ, నిజమైన రాజకీయ భాగస్వామ్యాన్నీ అందిస్తేనే లిబరల్ డెమొక్రసీ భవిత పదిలంగా ఉంటుంది. అది చేయలేనప్పుడు ప్రజలు ప్రత్యామ్నాయాల వైపు చూస్తారు. లిబరల్ డెమొక్రసీకి అప్పుడు అసలైన ప్రమాదం ముంచుకొస్తుంది. ప్రధాన స్రవంతికి చెందిన అసెమోగ్లూ లాంటి ఆర్థికవేత్తలు కూడా విపరీత సంపద, ఆదాయ కేంద్రీకరణలతో వచ్చే సమస్యలు సమాజాన్నీ, ప్రజాస్వామ్యాన్నీ ఛిన్నాభిన్నం చేసే ప్రమాదం ఉందని హెచ్చరించటం చాలా మందిని ఆలోచింపచేస్తోంది. టెక్నాలజీని... అది ఏఐ అయినా... మరొకటైనా దాని మానాన దాన్ని వదిలేస్తే మొదటికే మోసం తెస్తుంది. హఠాత్తుగా ఎందరి జీవితాలనో తారుమారు చేస్తుంది. హద్దుల్లేని లాభార్జన, అడ్డూఅదుపూ లేకుండా సంపదలు కొందరి చేతుల్లో పోగుపడటం సమాజాన్ని నిరాశమయంగా మార్చుతుంది. నిరాశ ఆవహించిన మనుషులూ, సమాజాలూ ఎప్పటికైనా ప్రమాదకరమే! ఆ ప్రమాదం ముదిరితే లిబరల్ డెమొక్రసీకీ కష్టకాలమే!

వార్త సాక్ష్యం
శనివారం 05 సెప్టెంబర్ 2026

# పేదలకు ఉచిత న్యాయసలహాలు అందిస్తా

-అంబేద్కర్ ఆలోచనా విధానంలో ముందుకెళ్తున్న యువ న్యాయవాది కోడి మోహన్ రావు

పెద్దదోర్నాల సెప్టెంబర్ 4 వార్త సాక్ష్యం

సమాజంలో అణగారిన, పేద, బలహీన వర్గాల ప్రజలకు న్యాయం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో యువ న్యాయవాది కోడి మోహన్ రావు ముందుకు సాగుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ఆదర్శంగా తీసుకుని, రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వారికి ఉచిత న్యాయసలహాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక స్థోమత లేక న్యాయ సహాయం పొందలేక ఇబ్బందులు పడుతున్న పేదలకు అండగా నిలవడం తన సామాజిక బాధ్యతగా భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, కార్మికులు, రైతులు, అణగారిన వర్గాలు తమ హక్కులను తెలుసుకుని న్యాయం కోసం ముందుకు రావాలని సూచిస్తున్నారు.



-చట్టం అందరికీ సమానమే

న్యాయం కేవలం ఆర్థికంగా బలమైన వారికి మాత్రమే కాకుండా ప్రతి పేదవాడికి అందాలి. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రజలకు చేరువ చేయడమే నా లక్ష్యం అని కోడి మోహన్ రావు తెలిపారు. అంబేద్కర్ చూపిన రాజ్యాంగ మార్గంలో సామాజిక న్యాయం కోసం పనిచేస్తూ, న్యాయవాద వృత్తిని సేవా దృక్పథంతో కొనసాగిస్తున్న కోడి మోహన్ రావును పలువురు అభినందిస్తున్నారు. మార్కాపురం కోర్టులో ఆయన న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు

# శ్రీపతిరావుపేటలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు




-అంగరంగ వైభవం కృష్ణాష్టమి వేడుకలు

-శ్రీకృష్ణుని వేషధారణలో అలరించిన చిన్నారులు

ఆత్మకూరు సెప్టెంబర్ 4 వార్త సాక్ష్యం

మండల పరిధిలోని శ్రీపతిరావుపేట గ్రామంలో శుక్రవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా యాదవులు, గ్రామస్తులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని నిర్వహించారు ఈ వేడుకలలో చిన్నారులు వేసిన శ్రీకృష్ణుని వేషధారణలు పలువురిని అలరించాయి అలాగే గ్రామంలో స్వామివారిని ఊరేగింపు నిర్వహించారు అడుగడుగునా పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించి యువత ఉట్టి పగలగొట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలు తదితర గ్రామాల ప్రజలు సుదూర ప్రాంతంలో ఉన్నవారు శ్రీ కృష్ణాష్టమి వేడుకలలో పాల్గొన్నారు.



# వెలుగోడు పట్టణంలో అంగరంగ వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

వెలుగోడు సెప్టెంబర్ 4 వార్త సాక్ష్యం

వెలుగోడు పట్టణశీ లో శ్రీకృష్ణ జన్మాష్టమి జయంతి ఉత్సవాల వేడుకలు త్రైత సిద్ధాంతము, యాదవ సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగాయి. శుక్రవారం వాసవి కళ్యాణ మంటపము లో ఉదయము పూజా కార్యక్రమం పూలతో అలంక రించిన ప్రత్యేక మండపము నందు శ్రీకృష్ణుని విగ్రహా నికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. భోజనము అనశీతరము శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహము ఊరేగింపుగా అమ్మవారి శాల నుంచి గ్రామపంచాయతీ కార్యాలయం, పెద్ద దేవాలయము, తెలుగు పేట, చాకలి పేట మీదుగా తిరిగి అమ్మవారిసాలకు చేరుకోవడం జరిగింది. ఊరేగింపులో బాలికల కోలాటం నృత్యం విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు స్వామి వారిని భక్తిగా దర్శించుకున్నారు. అనంతరము సంజీవరాయ దేవాలయం వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమశీ లో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్ర మంలో త్రైత సిద్ధాంతము సభ్యులు వెంకటేశ్వర్లు జనార్ధన్ యాదవ సంఘం నాయకులు రఘురా ముడు, నాగేశ్వరరావు, వెంకటయ్య, సూర్యనా రాయణ, విజయ్, రాఘవేంద్ర, సుమన్ తదితరులు పాల్గొన్నారు





# అచీవర్స్ స్కూల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

-విద్యార్థులను కూలీలుగా మార్చడం చాలా సిగ్గుచేటు

-ఆర్ఎస్ఎఫ్ విద్యార్థి సంఘం జిల్లా నాయకులు వేటూరి రంగస్వామి డిమాండ్

నంద్యాల సెప్టెంబర్ 4 వార్త సాక్ష్యం

విద్యార్థులతో రాత్రివేళ నిర్మాణ సామగ్రి మోయించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న నంద్యాల ఎన్జీవోస్ కాలనీలోని అచీవర్స్ స్కూల్ యాజ మాన్యం పై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆర్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వేటూరి రంగస్వామి శనివారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు వేలాది రూపాయలు ఫీజులు చెల్లించి తమ పిల్లలను చదువు, భద్రమైన భవిష్యత్తు కోసం హాస్టల్‌లో చేర్పిస్తుంటే, వారితో రాత్రి 10 గంటల తర్వాత పైపులు, బండరాళ్లు, ఇతర నిర్మాణ సామగ్రి మోయించడం విద్యార్థుల హక్కులను, భద్రతను తుంగలో తొక్కినట్లేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల చేతుల్లో పుస్తకాలు ఉండాలి.. నిర్మాణ సామగ్రి కాదు. చదువుకోవాల్సిన విద్యార్థులతో కూలీ పనులు చేయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాత్రివేళ నిర్మాణ ప్రదేశంలో విద్యార్థులతో పనులు చేయించడం వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని నిలదీశారు. ఈ ఘటనపై విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి పాఠశాలను తనిఖీ చేయాలని, విద్యార్థుల నుంచి స్వేచ్ఛగా వివరాలు సేకరించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరారు. అధికా రులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అది యాజమాన్యానికి పరో క్షంగా మద్దతు ఇచ్చినట్లేనని అన్నారు. విద్యార్థులను నిర్మాణ పనులకు వినియోగించినట్లు విచారణలో తేలితే అచీవర్స్ స్కూల్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మీడియా ద్వారా తెలియజేశారు.




# నేడు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ఆధ్వర్యంలో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి కేసీ కెనాల్ కు నీటి విడుదల

నంద్యాల సెప్టెంబర్ 4 వార్త సాక్ష్యం

జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలంలోని ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి కేసీ కెనాల్ కు నేడు నీరు విడుదల చేస్తున్నట్లు నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తాగునీటికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని, ప్రజల దాహార్తి తీర్చడం మా మొదటి కర్తవ్యం అని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెప్పారు.

నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



## జిల్లా ఉత్తమ ఐఈఆర్టీగా వెలుగోడు పట్టణానికి చెందిన శంషుద్దీన్ ఎంపిక

ఆత్మకూరు సెప్టెంబర్ 4 వార్త సాక్ష్యం



జిల్లా ఉత్తమ ఐఈఆర్టీ ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్ గా వెలుగోడు పట్టణానికి చెందిన శంషుద్దీన్ ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన పాములపాడు మండలంలో ఐఈఆర్టీగా విధులు నిర్వహిస్తున్నారు. విధుల్లో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి జిల్లా విద్యాధి. కారులు ఉత్తమ ఐఈఆర్టీగా ఎంపిక చేశారు. విద్యార్థుల పట్ల ఆయన చూపిస్తున్న చొరవ, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని అధికారులు కొనియాడారు. ఆయన ఎంపిక పట్ల ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## రూ.2.65 కోట్లతో వైద్య భవనాలు ప్రారంభం

-గ్రామీణ పేదలకు చేరువలో వైద్యం: ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు సెప్టెంబర్ 4 వార్త సాక్ష్యం

గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో అచ్చంపేట మండలంలో రూ.2.65 కోట్లతో నిర్మించిన వైద్య భవనాలు అందుబాటులోకి వచ్చాయి. వేల్పూరు, తాడువాయి గ్రామాల్లో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, చింతపల్లిలో నిర్మించిన పీహెచ్‌సీ భవనాలను పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రారంభించారు. గ్రామీణ ప్రజలు చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు సైతం దూర ప్రాంతాల్లోని ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితిని తగ్గించడంతో పాటు, పేద కుటుంబాలపై ప్రయాణ, వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు స్థానికంగానే వైద్య సదుపాయాలు కల్పించడం ఈ కేంద్రాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. వ్యాధులను తొలిదశలో గుర్తించి చికిత్స అందించడం, గర్భిణులు, చిన్నారులు, వృద్ధులకు నిరంతర ఆరోగ్య పర్యవేక్షణ అందించడం ద్వారా గ్రామీణ ప్రజారోగ్య వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం వైద్య మౌలిక వసతులను అభివృద్ధి చేస్తోందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్యం అందించేందుకు మరింత కృషి చేస్తామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని చోట్ల కూటమి అభ్యర్థులు గెలిచేలా పనిచేస్తున్నామని పేర్కొన్నారు.

## ప్రజలకు సురక్షిత తాగునీటి భరోసా




కారంచేడు సెప్టెంబర్ 4 వార్త సాక్ష్యం

బాపట్ల జిల్లా కారంచేడు గ్రామంలోని హరిజనవాడ చెరువు వద్ద ఓఎన్జీసీ సామాజిక బాధ్యత సి ఎస్ ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన సామాజిక నీటి శుద్ధి జల కేంద్రాన్ని లోక్‌సభ ప్యానెల్ స్పీకర్, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాజమండ్రి ఎంపీ, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, పరుచూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, దగ్గుబాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీటిని అందుబాటులోకి తీసుకురావడమే కేంద్రం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ నీటి శుద్ధి కేంద్రం ద్వారా పరిసర ప్రాంతాల ప్రజలకు శుద్ధి చేసిన తాగునీరు లభించడంతో కలుషిత నీటి కారణంగా వచ్చే అనారోగ్య సమస్యలు తగ్గే అవకాశం ఉందన్నారు. స్థానికంగా స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రావడంతో ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకునే ఇబ్బందులు తగ్గడంతో పాటు, పేద కుటుంబాలపై తాగునీటి వ్యయం, ఆరోగ్య పరమైన భారాలు తగ్గనున్నాయి. ముఖ్యంగా వేసవి కాలంలో తాగునీటి కొరతను కొంతమేర అధిగమించేందుకు ఈ కేంద్రం ఉపయోగ పడనుంది. ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ప్రజారోగ్య పరిరక్షణతో పాటు గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే సామాజిక మౌలిక వసతిగా నిలవనుంది. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వార్త సాక్ష్యం
శనివారం 05 సెప్టెంబర్ 2026

## పురందేశ్వరిని కలిసిన బీజేపీ నేతలు



కారంచేడు సెప్టెంబర్ 4 వార్త సాక్ష్యం

బాపట్ల జిల్లా కారంచేడు మండలంలోని తన స్వగ్రామానికి వచ్చిన బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిను పలువురు బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ కార్యక్రమాలపై నాయకులు ఆమెతో చర్చించినట్లు సమాచారం. ఈ భేటీలో రేపల్లె రూరల్ అధ్యక్షుడు ఏమినేని డేనియల్ బాబు, పిన్ని సాంబశివరావు, రాజు, మాజీ జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో పార్టీ బలోపేతం, స్థానిక రాజకీయ పరిస్థితులపై నాయకులు పురందేశ్వరితో చర్చించినట్లు తెలిసింది.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

-ఎమ్మెల్యే కొండయ్య



చీరాల సెప్టెంబర్ 4 వార్త సాక్ష్యం

చీరాల నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి త్వరితగతిన పరిష్కారం చూపించడమే ప్రజా దర్బార్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య తెలిపారు. చీరాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 17 వినతులను ఎమ్మెల్యే స్వీకరించారు. ఇళ్లు, పింఛన్లు, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి అర్జీని పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజలు తమ సమస్యలను నేరుగా ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజా దర్బార్ వేదికగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే మాలకొండయ్య స్పష్టం చేశారు.

## ఆలయాల పునర్నిర్మాణానికి భూమి పూజ

-పూజా కార్యక్రమంలో పాల్గొన్న పరుచూరి ఎమ్మెల్యే ఏలూరి..



సంతరావూరు సెప్టెంబర్ 4 వార్త సాక్ష్యం

ఆధ్యాత్మిక చింతనతోనే సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యత పెంపొందుతాయని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. సంతరావూరులో శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయాల పునర్నిర్మాణం, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం, దాతలు, భక్తులు ముందుకు వచ్చి సహకరించడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పురాతన ఆలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తున్నా యని, వాటి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఏలూరి తెలిపారు. ఆలయాల పునరుద్ధరణకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందించడంతో పాటు, దాతల సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆలయాల అభివృద్ధికి ప్రజలు, దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఎమ్మెల్యే పిలుపుని చ్చారు. దేవాలయాల పునర్నిర్మాణం కేవలం నిర్మాణ కార్యక్రమం కాదని, భవిష్యత్ తరాలకు మన ఆధ్యాత్మిక వారసత్వాన్ని అందించే పవిత్ర బాధ్యత అని పేర్కొన్నారు.

# ఘనంగా శ్రీ కృష్ణ జయంతి సంబరాలు





వెలుగోడు సెప్టెంబర్ 4 వార్త సాక్ష్యం

వెలుగోడు పట్టణ కేంద్రంలో శ్రీ సరస్వతీ శిశు మందిరం పాఠశాల వెలుగోడు నందు శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు చేత కృష్ణుని మరియు గోపికల వేష ధారణల తో పాటు ఉట్టి కట్టి కృష్ణుని చేత కొట్టించడం జరిగింది. విద్యార్థుల వేషధారణలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల కార్యదర్శి కె. రాఘవరావు కమిటీ సభ్యులు ఎం. భాస్కర్ రెడ్డి, ప్రధాన అధ్యాపకులు మురళి పోషకులు విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో గోమాతకు ఘనంగా పూజలు





-గోసేవయే గోవిందుడి సేవ --- ధార్మిక చైతన్యానికి గోపూజ దోహదం

కర్నూలు, సెప్టెంబర్ 4 వార్త సాక్ష్యం

శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్, ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కర్నూలు నగర శివారులో వెలసిన శ్రీగోదాగోకులం నందు గోపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహి ంచారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గోమాతను ప్రత్యేకంగా అలంకరించి, పసుపు, కుంకుమలతో పూజించి, వస్త్రం, పుష్ప మాలలు సమర్పించారు. తిరునగరి రమేషాచార్యులు, వేదపండితులు వరయూరు కిరణ్ కుమారాచార్యులు, లక్ష్మీ నారాయణాచార్యులు, మహేషాచార్యులు, పద్మనారాయణలు వేదమంత్రోచ్చారణల మధ్య గోమా తకు హారతి ఇచ్చి, భక్తులతో గోప్రదక్షిణలు నిర్వహిం పచేశారు. ఈ సందర్భంగా హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి మాట్లాడుతూ, భారతీయ సనాతన ధర్మంలో గోవుకు అత్యంత విశిష్టమైన స్థానం ఉన్నదని తెలిపారు. శ్రీకృష్ణుడు గోపాలుడిగా గోవుల తో అనుబంధాన్ని కలిగి ఉన్నందున శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గోపూజ నిర్వహించడం ఎంతో పవిత్రమైన కార్యక్రమమని పేర్కొన్నారు. గోసేవ, గోపూజ ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల భక్తిభావం పెంపొందడంతో పాటు, ధార్మిక చైతన్యం మరియు సేవాభావం ప్రజల్లో మరింతగా వికసిస్తాఅయని తెలిపారు. నేటి తరానికి సనాతన ధర్మంలోని విలువలను తెలియజేయడం, ఆచార వ్యవహారాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థా నముల హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ధార్మిక చైతన్యం, భక్తి, సత్సంగాలు, భజనలు, పూజా కార్యక్రమాలు మరియు సనాతన ధర్మ ప్రచార కార్యక్రమాలను నిరంతరం నిర్వహి స్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గోదాగో కులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగ రాజు గుప్త, ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, తుమ్మేపల్లి శ్రీనివా సరావు, పాలాది సుబ్రహ్మణ్యం, వేముల జనార్దన్, పెరుమాళ్ళ బాలసుధాకర్, భూమా కృష్ణ మోహన్, లింగం రవి, లింగం కృష్ణయ్యశ్రేష్ఠి, తల్లం సురేష్, మాకం శ్రీని వాస్, నూకల గిరిబాబు, జి. రాధాకృష్ణ, ఇ. పుల్లయ్య పెద్ద సంఖ్యలో గోదాపరివార్ మహిళలు, భక్తులు పాల్గొని గోమాత ఆశీస్సులు పొందారు. కుంకు మార్చన, ఊంజల్ సేవ, పల్లకి సేవ, ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల బాలకృష్ణుల వేషధారణలు భక్తులను ముచ్చట గొలిపాయి. గోపూజ అనంతరం భక్తులందరికీ మహా ప్రసాద వితరణ చేశారు.

# పట్టణంలోప్రగతి హై స్కూలులో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు







ఆత్మకూరు సెప్టెంబర్ 4 వార్త సాక్ష్యం

పట్టణంలోని ప్రగతి హై స్కూల్ లో శనివారం శ్రీ కృష్ణాష్టమి జన్మదిన వేడుకల సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు అంగరంగ వైభవంగా వివిధ సంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు ముందుగా పాఠశాల కరస్పాండెంట్ రాఘవ కృష్ణ శకుంతల ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు అనంతరం విద్యార్థులు శ్రీకృష్ణుని వేషధారణ విద్యార్థినీలు గోపికలతో ప్రత్యేక అలంకరణలో విద్యార్థులు కనువిందు చేశారు ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రాఘవ కృష్ణ శకుంతలలు,మాట్లాడుతూ, మహాభారత యుద్ధాన్ని ముందుండి నడిపించిన శ్రీకృష్ణుడు అని పేర్కొన్నారు మహా భారతం కథలు విన్నా, కృశ్యాలను బూసినా జీవితానికి సరిపడ విలువలు ఎన్నో బోద పడతాయన్నారు గాదలు నేటికి ఆదర్శంగా ఉన్నాయన్నారు. శ్రీకృష్ణుని ప్రతిఒక్కరు ఇష్ట దైవంగా కొలుస్తారన్నారు . పాఠశాల విద్యార్థినీ విద్యారుతో, శ్రీకృష్ణుడు గోపికల వేష ధారణతో విశేషముగా చిన్నారు లందరు ప్రదర్శించి నృత్య ప్రదర్శను, కోలాటము అందరిని మెప్పించాయి అని అన్నారు. ఈ కార్యక్రమశీ లో పాఠశాల విద్యార్థుల తల్లి తండ్రులు, విద్యారులు, ఉపాద్యాయులు తదిత రులు పాల్గొన్నారు

# అక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యక్తులు అరెస్ట్

మందమర్రి సెప్టెంబర్ 4 వార్త సాక్ష్యం :

కౌటాల నుంచి జగిత్యాల జిల్లా రాజారాంపల్లి మార్కెట్‌కు పశువులను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని టోల్‌ప్లాజా వద్ద టాస్క్‌ఫోర్స్/నార్కోటిక్ టీమ్ సిబ్బంది శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులతో



వెళ్తున్న 3 మహీంద్రా క్యాంపర్ వాహనాలను అడ్డుకుని తనిఖీ చేయగా,వాటిలో 13 ఆవులు,17 దూడలు కలిపి మొత్తం 30 పశువులు ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి 3 మంది డ్రైవర్లు,4 మంది సహాయకులు కలిపి మొత్తం 7మందిని అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి 3 మహీంద్రా క్యాంపర్ వాహనాలు,4 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

VARTHAA SAKSHAMU వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక Editor : SAGINALA RAVI KUMAR


# టెన్నిస్ కోర్టులో పోలీస్ పవర్

**-రాష్ట్ర చాంపియన్‌గా బాపట్ల టౌన్ సీఐ రాంబాబు**
**-ట్రోఫీతో మెరిసిన ప్రతిభకు ఎస్పీ ఉమామహేశ్వర్ సత్కారం**

బాపట్ల, సెప్టెంబర్ 4 వార్త సాక్ష్యం :

ఖాకీ యూనిఫాంలో ప్రజాసేవకు అంకితమవుతూనే క్రీడా మైదానంలోనూ అద్భుత ప్రతిభ చాటిన బాపట్ల టౌన్ సీఐ ఆర్. రాంబాబు యువ పోలీసు అధికారులకు ఆదర్శంగా నిలిచారు. తొలి ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్--2026లో లాన్ టెన్నిస్ సింగిల్స్ విజేతగా ట్రోఫీ సాధించి జిల్లా పోలీసు శాఖ కీర్తిని రాష్ట్రస్థాయిలో నిలబెట్టారు. ఖాకీ విధుల్లోనే కాదు.. క్రీడా మైదానంలోనూ తన సత్తా చాటుతూ బాపట్ల టౌన్ సీఐ ఆర్. రాంబాబు రాష్ట్రస్థాయి లాన్ టెన్నిస్ సింగిల్స్ విజేతగా నిలిచారు. తొలి ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్--2026లో ట్రోఫీ కైవసం చేసుకున్న ఆయనను జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ అభినందించి మెడల్‌తో ఘనంగా సత్కరించారు. విధి నిర్వహణలో నిత్యం ఒత్తిడులు, సవాళ్ల మధ్య పనిచేసే పోలీసు అధికారి క్రీడా మైదానంలోనూ అదే పట్టుదలతో రాణిస్తే ఫలితం ఎలా ఉంటుందో బాపట్ల టౌన్ సీఐ ఆర్. రాంబాబు నిరూపించారు. రాష్ట్రస్థాయిలో తొలిసారిగా నిర్వహించిన 1వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్--2026లో లాన్ టెన్నిస్ సింగిల్స్ విభాగంలో విజేతగా నిలిచి బాపట్ల జిల్లా పోలీస్ శాఖకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. సెప్టెంబర్ 1 నుంచి 4వ తేదీ వరకు మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ ప్రాంగణంలో రాష్ట్రస్థాయి పోలీసు క్రీడా పోటీలు ఘనంగా జరిగాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, పోలీసు విభాగాలకు చెందిన ఎస్ఐ, ఆర్ఎస్ఐ, ఇన్‌స్పెక్టర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు లాన్ టెన్నిస్ సింగిల్స్ విభాగంలో పోటీపడ్డారు. ఇరవై మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్న హోరాహోరీ పోటీల్లో ప్రత్యర్థులను అధిగమిస్తూ సీఐ రాంబాబు విజేతగా నిలిచి ప్రతిష్టాత్మక ట్రోఫీని సొంతం చేసుకున్నారు. రాష్ట్రస్థాయి విజయానంతరం శుక్రవారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్‌ను సీఐ రాంబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన సాధించిన విజయాన్ని ఎస్పీ ప్రత్యేకంగా అభినం దించారు. మెడల్‌తో సత్కరించి జిల్లా పోలీసు శాఖ తరఫున ప్రశంసలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, రాష్ట్రస్థాయిలో తొలిసారిగా నిర్వహించిన పోలీసు క్రీడా పోటీల్లో బాపట్ల జిల్లా పోలీసు అధికారి విజేతగా నిలవడం గర్వకార ణమన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రతిభావంతులైన పోలీసు అధికారులతో పోటీపడి ట్రోఫీ సాధించడం సీఐ రాంబాబు క్రీడా నైపుణ్యానికి నిదర్శనమని కొనియాడారు. విధి నిర్వహణలో పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం ఒత్తిడిని ఎదుర్కొంటుంటారని, అలాంటి పరిస్థితుల్లో క్రీడలు మానసిక ప్రశాంతతను అందించడంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని ఎస్పీ పేర్కొన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, సహనం, పోరాట స్ఫూర్తి పెరుగుతాయని తెలిపారు. విధి నిర్వహణతో పాటు ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది ఆరోగ్యం, ఫిట్‌నెస్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రాష్ట్రస్థాయి విజయం బాపట్ల జిల్లా పోలీసు శాఖకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని ఎస్పీ అన్నారు. రాబోయే రోజుల్లో జాతీయస్థాయి పోలీసు క్రీడా పోటీల్లో కూడా పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని సీఐ రాంబాబుకు ఆకాంక్షించారు. ఖాకీ యూనిఫాంలో శాంతిభద్రతల పరిరక్షణకు విధులు నిర్వర్తిస్తూ, మరోవైపు టెన్నిస్ కోర్టులో రాష్ట్ర చాంపియన్‌గా నిలిచిన సీఐ రాంబాబు విజయంపై జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. విధి పట్ల అంకితభావంతో పాటు క్రీడల పట్ల ఆసక్తి ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని ఆయన విజయం మరోసారి చాటిచెప్పింది.




## ఆలయ అభివృద్ధికి మంత్రి భరోసా



సంతమాగులూరుసెప్టెంబర్ 4 వార్త సాక్ష్యం

సంతమాగులూరులో శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ పవిత్ర కార్యక్రమానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు, ఆలయ నిర్వాహకులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. నామాలు, శంఖుచక్రాలు, పాదుకల ప్రతిష్ఠ మహోత్సవాలను భక్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆకాంక్షించారు. ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ఆలయాలు కేంద్రాలుగా నిలుస్తున్నాయని, వాటి అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.ఆలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు భక్తులు, నిర్వాహకులతో కలిసి ముందుకు సాగుతామని తెలిపారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## వాహన తనిఖీలతో పోలీసుల నిఘా



చందోలు సెప్టెంబర్ 4 వార్త సాక్ష్యం

బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమా మహేశ్వర్ ఆదేశాల మేరకు చందోలు పోలీసులు క్షేత్రస్థాయిలో వాహన తనిఖీలు నిర్వహించారు. చందోలు--పొన్నూరు ప్రధాన రహదారిపై చందోలు ఎస్ఐ కె. మాధవరావు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేసి, నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా నిర్వహించిన ఈ తనిఖీల్లో ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌కు అడ్డుకట్ట వేయడం, రోడ్డు ప్రమాదాలను నివారించడం, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించడం లక్ష్యంగా పోలీసులు చర్యలు చేపట్టారు. వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చందులు ఎస్సై మాధవరావు మాట్లాడుతూ.. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపే వారిపై చలానాలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు తదితర వాహనాల్లో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల ప్రాణాపాయం సంభవించడంతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని పేర్కొన్నారు. వాహనదారులు వేగ నియంత్రణ పాటిస్తూ, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించకుండా, అన్ని రకాల ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల భద్రత, రోడ్డు ప్రమాదాల నియంత్రణలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని, సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చందోలు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# హెల్మెట్‌తోనే సురక్షిత ప్రయాణం

కర్లపాలెం సెప్టెంబర్ 4 వార్త సాక్ష్యం

రోడ్డు భద్రతా నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, వాహనదారులు హెల్మెట్ ధరించడంతో పాటు వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని బాపట్ల రూరల్ సర్కిల్ సీఐ హరికృష్ణ సూచించారు. జిల్లా ఎస్పీ బి. ఉమా మహేశ్వర్ ఆదేశాల మేరకు కర్లపాలెంలో ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహిస్తూ వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. సీఐ హరికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవీంద్ర పాల్గొని వాహనదారులకు పలు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ హరికృష్ణ హెచ్చరించారు. హెల్మెట్ కేవలం జరిమానాల నుంచి తప్పించుకునేందుకు కాకుండా ప్రమాద సమయంలో ప్రాణాలను కాపాడే శిరోరక్షగా భావించి ప్రతి ఒక్కరూ వినియోగించాలని సూచించారు.వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, ఇన్సూరెన్స్ తదితర అవసరమైన ధ్రువపత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని పోలీసులు తెలిపారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడిపే వారిపై నిబంధనల ప్రకారం జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులు, వాహన యజమానులకు పోలీసులు సూచించారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల బారిన పడటమే కాకుండా వారి భవిష్యత్తుపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించి మైనర్లకు ద్విచక్ర వాహనాలు, ఇతర మోటారు వాహనాలు ఇవ్వకుండా చూడాలని కోరారు.ఎస్ఐ రవీంద్ర మాట్లాడుతూ.. రోడ్డు భద్రతా నియమాలను నిర్లక్ష్యం చేయడం వల్ల విలువైన ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. వాహనదారులు వేగ నియంత్రణ పాటిస్తూ, ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా ప్రయాణించాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో నిర్లక్ష్యం, అతివేగం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వంటి కారణాలతో జరిగే ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు ."హెల్మెట్ ధరించండి.. ప్రాణాలను కాపాడుకోండి. వాహన ధ్రువపత్రాలను సక్రమంగా ఉంచుకోండి.. మైనర్లకు వాహనాలు ఇవ్వకండి. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి ప్రమాదాల ద్వారా సంభవించే మరణాలను నివారించండి" అని పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. వాహన తనిఖీల సందర్భంగా నిబం ధనలు ఉల్లంఘించిన వాహనదారులపై పోలీసులు జరిమానాలు విధించారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ఇటువంటి తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.




# 22-ఏ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం కోరుతూ జనసేన దీక్ష

**-హైదరాబాద్‌లో పాల్గొన్న కామారెడ్డి జిల్లా జనసేన నాయకులు**

కామారెడ్డి సెప్టెంబర్ 4 వార్త సాక్ష్యం :

22-ఏ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద భారీ నిరసన దీక్ష ప్రారంభమైంది. తెలంగాణ రాష్ట్ర జనసేన పార్టీ ఇన్‌చార్జి నేమూరి శంకర్ గౌడ్ అధ్యక్షతన ఈ నిరసన దీక్ష కొనసాగింది. ఈ సందర్భంగా 22-ఏ జాబితాలో ఉన్న భూముల సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు న్యాయం చేయాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. భూములపై ఉన్న ఆంక్షలను తొలగించి, సమస్యకు శాశ్వత పరిష్కా రం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు. నిరసన దీక్షలో జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసన తెలిపారు. కామారెడ్డి జిల్లా జనసేన నాయకులు కంచర్ల నర్సాగౌడ్ ఆధ్వర్యంలో 'చలో హైదరాబాద్' కార్యక్రమంలో భాగంగా హైదరా బాద్‌కు తరలివెళ్లి దీక్షలో పాల్గొన్నారు. 22-ఏ భూముల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని వారు కోరారు.



VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# బిజినెస్

## ద్రవ్యోల్బణం, లిక్విడిటీ ఒత్తిడి.. రెపో రేటు పెంపునకు సిద్ధమవుతున్న ఆర్బీఐ?




భారత ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న సంక్లిష్ట పరిస్థితుల నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపో రేటును ఏప్రిల్ 2027 నాటికి 6 శాతానికి పెంచే అవకాశం ఉందని ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ బంధన్ ఏఎంసీ తన నివేదికలో అంచనా వేసింది. మార్కెట్లలో పేరుకుపోయిన అదనపు నగదు లభ్యత (లిక్విడిటీ), పెరుగుతున్న ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల నేపథ్యంలో స్థిరమైన ద్రవ్య విధానాన్ని రూపొందించేందుకు ఈ పెంపు అవసరమని నివేదిక శుక్రవారం స్పష్టం చేసింది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం ఒకవైపు, విదేశీ పెట్టుబడుల రూపంలో భారీగా వస్తున్న రూపాయి నిధుల వల్ల ఏర్పడిన అదనపు లిక్విడిటీ మరోవైపు.. ఈ రెండింటి మధ్య భారత ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ ఇన్వెస్టర్లు సంక్లిష్టమైన వాతావరణాన్ని ఎదుర్కొంటున్నారని నివేదిక విశ్లేషించింది. ఈ అదనపు నగదు ప్రవాహం కారణంగా ఓవర్‌నైట్ వడ్డీ రేట్లు, ఆర్బీఐ పాలసీ రేటు కంటే చాలా తక్కువ స్థాయికి పడిపోయాయని తెలిపింది. ఈ అసమతుల్యతను సరిదిద్దడానికి ఆర్బీఐ త్వరలోనే రంగంలోకి దిగాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి ఆర్బీఐ ఎంత వేగంగా చర్యలు తీసుకుంటుందన్న దానిపైనే భవిష్యత్తు ఆధారపడి ఉందని నివేదిక అభిప్రాయపడింది. ఓవర్‌నైట్ రేట్లను తిరిగి పాలసీ రేట్లతో అనుసంధానించడం, మధ్యకాలికంగా ఉన్న అదనపు లిక్విడిటీని తగ్గించడం, ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని రెపో రేటు పెంపుపై ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) నిర్ణయం తీసుకోవడం వంటి చర్యలు ఉంటాయని అంచనా వేసింది. ఎఫ్ఎక్స్ స్వాప్స్, ఎంఎస్ఎస్ బాండ్లు, ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ (ఓఎంఓ) అమ్మకాలు, అవసరమైతే నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్) పెంపు వంటి చర్యలను మార్కెట్ వర్గాలు ఆశిస్తున్నాయని తెలిపింది.

## ఎయిర్ ఇండియా విమానంలో కలకలం- పైలట్‌కు డ్రగ్స్ టెస్ట్‌లో పాజిటివ్!

ఫూకెట్ నుంచి ఢిల్లీ వస్తున్న ఎయిర్ ఇండియా విమానంలో చోటుచేసుకున్న తీవ్రమైన ఘటనకు సంబంధించి సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. విమానం గాల్లో ఉండగా అదుపుతప్పిన ఈ ఘటనపై దర్యాప్తు జరిపిన ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ), విమాన పైలట్-ఇన్-కమాండ్ (పీఐసీ) మత్తు పదార్థం (సైకోయాక్టివ్ సబ్‌స్టెన్స్) సేవించినట్లు ప్రాథమిక నివేదికలో నిర్ధారించింది. ఇది అత్యంత తీవ్రమైన విషయమని పేర్కొంటూ నేడు నివేదికను విడుదల చేసింది. ఏం జరిగింది? ఆగస్టు 4న 137 మంది ప్రయాణికులు, ఆరుగురు క్యాబిన్ సిబ్బంది, ఇద్దరు పైలట్లతో సహా మొత్తం 145 మందితో ఎయిర్ ఇండియాకు చెందిన ఏఐ-2379 విమానం ఫూకెట్ నుంచి ఢిల్లీకి బయలుదేరింది. విమానం ఒడిశా గగనతలంపై 36,000 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తుండగా, ఒక్కసారిగా దాని మూడు హైడ్రాలిక్ వ్యవస్థలు విఫలమయ్యాయి. దీంతో విమానం మొదట 372 అడుగులు పైకి దూసుకెళ్లి, ఆ తర్వాత వెంటనే 292 అడుగులు కిందకు పడిపోయింది. ఈ ఘటనతో విమానంలో తీవ్ర కుదుపులు ఏర్పడి, ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. ఈ ప్రమాదంలో కనీసం 20 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది గాయపడ్డారు. విమానం లోపల ఓవర్‌హెడ్ స్టోరేజ్ బిన్‌లు, సీలింగ్ ప్యానెళ్లు దెబ్బతిన్నాయి. నివేదికలో కీలక అంశాలు విమానం ఢిల్లీలో ల్యాండ్ అయిన తర్వాత ఇద్దరు పైలట్లకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించగా, ఫలితాలు సాధారణంగానే వచ్చాయి.




అయితే, అనంతరం నిర్వహించిన సైకోయాక్టివ్ పదార్థాల గుర్తింపు పరీక్షలో పైలట్-ఇన్-కమాండ్ శాంపిల్ 'నాన్-నెగెటివ్'గా తేలింది. కో-పైలట్ శాంపిల్ మాత్రం నెగెటివ్‌గా వచ్చింది. దీన్ని ధ్రువీకరిం చుకోవడానికి ఇద్దరి రక్త నమూనాలను పాథలాజికల్ ల్యాబొరేటరీకి పంపారు. అక్కడ జరిపిన కన్ఫర్మేటరీ టెస్టులో కూడా పైలట్-ఇన్-కమాండ్ నివేదిక 'నాన్-నెగెటివ్' అని తేలగా, కో-పైలట్ ఫలితాలు రెండు పరీక్షల్లోనూ నెగెటివ్‌గానే ఉన్నట్లు ఏఏఐబీ నివేదిక స్పష్టం చేసింది. ఈ ఫలితాల ఆధారంగా సంబంధిత పైలట్‌పై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)కు ఏఏఐబీ సిఫార్సు చేసింది. ఎయిర్ ఇండియా స్పందన ఈ ఘటనపై ఎయిర్ ఇండియా స్పందిస్తూ.. తాము దర్యాప్తు సంస్థలకు పూర్తిగా సహకరిస్తున్నామని తెలిపింది. భద్రతకే తమ ప్రథమ ప్రాధాన్యత అని, నిబంధనల ఉల్లంఘనలను ఏమాత్రం సహించ బోమని స్పష్టం చేసింది. ఈ ఘటన తర్వాత తమ పైలట్లందరికీ స్వచ్ఛందంగా డ్రగ్స్ పరీక్షలు ప్రారంభించినట్లు పేర్కొంది. కాగా, ఫూకెట్‌లో విమానం బయలుదేరడానికి ముందు జరిపిన తనిఖీల్లో ఎలాంటి లోపాలు గుర్తించలేదని, పైలట్లు కూడా వాక్-అరౌండ్ తనిఖీలో ఎటువంటి సమస్యలు లేవని నివేదించినట్లు ఏఏఐబీ నివేదికలో పేర్కొంది. ఈ ఘటనకు సంబంధించిన సాంకేతిక, ఇతర అంశాలపై ఇంకా లోతైన దర్యాప్తు కొనసాగుతోంది.

## కియా నుంచి కొత్త కారు.. డీజిల్, హైబ్రిడ్, ఏడబ్ల్యూడీతో అదిరిపోయే ఎస్‌యూవీ

కియా ఇండియా కొత్తగా సోరెంటో ఎస్‌యూవీని భారత మార్కెట్లో విడుదల చేసింది. దీని ప్రారంభ ధర రూ. 27.99 లక్షలు (ఎక్స్‌షోరూమ్). సెల్టోస్‌కు పైన ఈ మోడల్‌ను తీసుకొచ్చింది. భారత్‌లో కియా విక్రయించే ఫ్లాగ్‌షిప్ ఐసీఈ ఎస్‌యూవీగా సోరెంటో నిలిచింది. టయోటా ఫార్చ్యూనర్, స్కోడా కొడియాక్, జీప్ మెరిడియన్, ఫోక్స్‌వ్యాగన్ టైరాన్‌తో ఇది పోటీపడనుంది. సోరెంటో పొడవు 4,815 మి.మీ., వెడల్పు 1,900 మి.మీ., ఎత్తు 1,785 మి.మీ. వీల్‌బేస్ 2,815 మి.మీ. సెగ్మెంట్‌లో పొడవైన, వెడల్పైన మోడల్‌గా కియా చెబుతోంది. నిలువుగా ఉండే హెడ్‌ల్యాంప్స్, డీఆర్ఎల్స్, టైగర్ నోస్ గ్రిల్‌తో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. 18 అంగుళాల అల్లాయ్ వీల్స్, నిలువు టెయిల్‌ల్యాంప్స్ ఉన్నాయి. మొత్తం 8 రంగుల్లో లభిస్తుంది. ఆల్-బ్లాక్ ఆప్షన్ కూడా ఉంది. లోపల 12.3 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్ ఉంది. వేరియంట్‌ను బట్టి 4 అంగుళాల ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ లేదా 12.3 అంగుళాల డిజిటల్ డిస్‌ప్లే వస్తుంది. టాప్ వేరియంట్లలో కియా కనెక్ట్ 2.0, ఓవర్-ది-ఎయిర్ అప్‌డేట్స్, డిజిటల్ కీ, హెడ్-అప్ డిస్‌ప్లే, జనరేటివ్ ఏఐ అసిస్టెంట్ ఉన్నాయి. వెంటిలేటెడ్ సీట్లు, పనోరమిక్ సన్‌రూఫ్, పవర్డ్ టెయిల్‌గేట్, బోస్ 12-స్పీకర్ ప్రీమియం ఆడియో సిస్టమ్ కూడా ఉన్నాయి. ఏడుగురు ప్రయాణించేందుకు మూడు వరుసల సీటింగ్ ఉంటుంది. ఆరు సీట్ల ఆప్షన్ కూడా ఉంది. భద్రత కోసం 7 ఎయిర్‌బ్యాగులు, 26 ఫీచర్ల సేఫ్టీ ప్యాకేజీ ఇచ్చారు. టాప్ వేరియంట్లో 10 ఎయిర్ బ్యాగులు, లెవల్ 2ం ఏడీఏఎస్, సరౌండ్ వ్యూ మానిటర్, రిమోట్ పార్కింగ్ అసిస్ట్ వంటి ఫీచర్లు ఉన్నాయి. కియా ఇండియా సోరెంటోలో తొలిసారి స్ట్రాంగ్ హైబ్రిడ్, ఆల్ వీల్ డ్రైవ్ కలిపి అందిస్తోంది. 1.6 లీటర్ పెట్రోల్ ఇంజిన్, ఎలక్ట్రిక్ మోటార్‌తో కూడిన హైబ్రిడ్ 238 హెచ్‌పీ శక్తిని అందిస్తుంది. 265 ఎన్ఎం టార్క్ ఉంటుంది. డీజిల్ వెర్షన్‌లో 2.2 లీటర్ ఇంజిన్ 193 హెచ్‌పీ, 442 ఎన్ఎం టార్క్ ఇస్తుంది.



## ఈ నెల 22న టీమిండియా, జపాన్ క్రికెట్ మ్యాచ్.. ఎందుకంటే..!

భారత్, జపాన్ దేశాల మధ్య దౌత్య సంబంధాలు నెలకొని 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, ఈ మైత్రిని మరింత బలోపేతం చేసే దిశగా ఒక చారిత్రక క్రికెట్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. భారత్, జపాన్ దేశాల పురుషుల జట్ల మధ్య ఈ నెలలో ఒక ప్రత్యేక టీ20 అంతర్జాతీయ మ్యాచ్ జరగనుంది. 'సుజుకి కప్' పేరుతో జరగనున్న ఈ మ్యాచ్‌కు సెప్టెంబర్ 22న జపాన్‌లోని టోచిగి ప్రిఫెక్చర్‌లో ఉన్న సానో అంతర్జాతీయ క్రికెట్ గ్రౌండ్ ఆతిథ్యం ఇవ్వనుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనే తకైచి మధ్య జరిగిన శిఖరాగ్ర సమావేశంలో కుదిరిన 'స్పోర్ట్ 75' ఒప్పందంలో భాగంగా ఈ మ్యాచ్‌ను నిర్వహిస్తున్నారు. ఇరు దేశాల మధ్య క్రీడా సంబంధాలను, సాంస్కృతిక సహకారాన్ని ప్రోత్సహించడమే ఈ ఒప్పందం యొక్క ప్రధాన లక్ష్యం. ఈ చారిత్రక మ్యాచ్‌పై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శి దేవజిత్ సైకియా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. "ఈ చారిత్రక ఘట్టంలో భాగం కావడం బీసీసీఐకి ఎంతో ఆనందంగా ఉంది. ఇది క్రికెట్‌కు చాలా ముఖ్యమైన క్షణం. భారత జట్టును జపాన్‌కు తీసుకెళ్లడం ద్వారా తూర్పు ఆసియాలో ఈ క్రీడను విస్తృత ప్రేక్షకులకు పరిచయం చేసే అవకాశం లభిస్తుంది" అని ఆయన తెలిపారు. భారత్-జపాన్ మధ్య బలమైన స్నేహ బంధం ఉందని, ఈ వేడుకల్లో క్రికెట్‌ను భాగం చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. సంప్రదాయ దేశాలు దాటి ప్రపంచవ్యాప్తంగా క్రికెట్‌ను విస్తరించే బాధ్యత తమపై ఉందని, ఈ దిశగా జపాన్ క్రికెట్ అసోసియేషన్ (జేసీఏ)తో కలిసి పనిచేస్తామని సైకియా వివరించారు. మరోవైపు, జపాన్ క్రికెట్ అసోసియేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ నవోకి మియాజీ మాట్లాడుతూ, "ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్లను జపాన్‌లో మా సొంత గడ్డపైకి ఆహ్వానించడం మా అసోసియేషన్‌కు ఒక చారిత్రక ఘట్టం. ఈ లక్ష్య సాధనకు సహకరించిన బీసీసీఐకి ధన్యవాదాలు" అని అన్నారు. భారత క్రికెట్ అభిమానుల ఉత్సాహానికి స్వాగతం పలుకుతున్నామని, స్థానిక జపనీయులు కూడా పెద్ద సంఖ్యలో వచ్చి తమ జట్టును ప్రోత్సహించాలని కోరారు. ఈ మ్యాచ్‌కు అభిమానుల తాకిడి అధికంగా ఉంటుందని అంచనా వేస్తున్న నిర్వాహకులు, సానో మైదానం సామర్థ్యాన్ని 500 నుంచి 2,000కు పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరలోనే అధికారిక సోషల్ మీడియా ఛానెళ్లలో టికెట్ల అమ్మకాలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ 24 నుంచి జపాన్‌లో ప్రారంభం కానున్న ఆసియా క్రీడల్లో పాల్గొనేందుకు భారత క్రికెట్ జట్టు అక్కడికి వెళుతున్న నేపథ్యంలో ఈ ప్రత్యేక మ్యాచ్‌ను ఏర్పాటు చేశారు. ఆసియా క్రీడల కోసం భారత జట్టుతో పాటు నెట్ బౌలర్లుగా లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ విక్కీ ఓస్వాల్, పేసర్లు రసిఖ్ సలామ్, కార్తీక్ త్యాగి కూడా జపాన్‌కు వెళ్లనున్నారు. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అధిపతి వీవీఎస్ లక్ష్మణ్ పర్యవేక్షణలో ఉన్న ఈ ముగ్గురు యువ బౌలర్లకు ఇది మంచి అవకాశమని, వారి పాస్‌పోర్ట్, వీసా ప్రక్రియలు కొనసాగుతున్నాయని బీసీసీఐ వర్గాలు తెలిపినట్లు ఐఏఎన్ఎస్ తన కథనంలో పేర్కొంది.




## దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు సిరాజ్, పడిక్కల- సౌత్ జోన్ జట్టులో చోటు!

దులీప్ ట్రోఫీ ఫైనల్ పోరుకు భారత స్టార్ క్రికెటర్లు మహ్మద్ సిరాజ్, దేవదత్ పడిక్కల్ సిద్ధమయ్యారు. సెప్టెంబర్ 6 నుంచి ఈస్ట్ జోన్‌తో జరగనున్న ఫైనల్ కోసం సౌత్ జోన్ జట్టులో వీరిద్దరికీ చోటు దక్కింది. ఇటీవల శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లోనూ ఇద్దరూ భారత్ తరఫున ఆడారు. ఈ సిరీస్‌ను భారత్ 1-0తో గెలుచుకుంది. శ్రీలంక సిరీస్‌లో పడిక్కల్ అద్భుతంగా రాణించాడు. మూడు ఇన్నింగ్స్‌ల్లో 328 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచాడు. ఇందులో రెండు సెంచరీలు ఉన్నాయి. మరోవైపు సిరాజ్ రెండు టెస్టుల్లో నాలుగు వికెట్లు పడగొట్టాడు. అయితే దులీప్ ట్రోఫీ ఫైనల్ కోసం వీరిద్దరూ సౌత్ జోన్ జట్టులో ఎవరిని భర్తీ చేస్తారన్నది ఇంకా స్పష్టంగా తెలియలేదు. టీ20 జట్టులో రెగ్యులర్‌గా ఉంటున్న వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ కూడా ఫైనల్‌లో ఆడే అవకాశం ఉందని సమాచారం. సెప్టెంబర్ 10న దులీప్ ట్రోఫీ ఫైనల్ ముగియనుండగా.. సెప్టెంబర్ 13 నుంచి ఆఫ్ఘనిస్థాన్‌తో టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. అయినా ఫైనల్‌లో ఆడేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తిలక్ ఇప్పటికే చెప్పాడు. నార్త్ జోన్‌తో సెమీఫైనల్లో తిలక్ తొలి ఇన్నింగ్స్‌లో 116 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 51 పరుగులతో ఆకట్టుకున్నాడు. సౌత్ జోన్ సెమీఫైనల్లో నార్త్‌ను 181 పరుగుల ఛేదనలో ఓడించింది.




# స్పోర్ట్స్

## క్రికెట్‌లో వయసు గోల్‌మాల్.. భారత అండర్-19 జట్టుకు ఎంపికైన కొద్దివారాలకే యువ స్పిన్నర్‌పై రెండేళ్ల నిషేధం!




భారత క్రికెట్‌లో వయసు తారుమారు వ్యవహారం మరోసారి తీవ్ర కలకలం రేపింది. ఆస్ట్రేలియాతో జరగబోయే సిరీస్ కోసం భారత అండర్-19 జట్టుకు ఎంపికైన కొద్ది వారాలకే, బెంగాల్ లెగ్ స్పిన్నర్ రోహిత్ యాదవ్‌పై బీసీసీఐ రెండేళ్ల నిషేధం విధించింది. వయసును తప్పుగా చూపించాడన్న ఆరోపణలతో ఈ కఠిన చర్యలు తీసుకుంది. వాస్తవానికి ఉత్తరప్రదేశ్‌కు చెందిన రోహిత్ యాదవ్, బెంగాల్ తరఫున ఆడుతున్నాడు. గత జులైలో శ్రీలంక పర్యటనకు వెళ్లిన భారత అండర్-19 జట్టులోనూ సభ్యుడిగా ఉన్నాడు. ఆ సిరీస్‌లో అద్భుతంగా రాణించి ఆరు వికెట్లు పడగొట్టి, ఫైనల్ టెస్టులో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ నెలలోనే ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో రాజ్‌కోట్, అహ్మదాబాద్‌లలో జరగనున్న వన్డే, మల్టీ-డే మ్యాచ్‌లకూ ఎంపికయ్యాడు. అయితే, శ్రీలంక పర్యటనలోనే అతని ధ్రువపత్రాల పరిశీలన సందర్భంగా వయసులో తేడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. విచారణలో రోహిత్ యాదవ్‌కు 2007, 2009, 2010 సంవత్సరాలతో మూడు వేర్వేరు జనన ధ్రువీకరణ పత్రాలు ఉన్నట్లు తేలింది. దీనికి తోడు అతని ఆధార్ రికార్డుల్లోనూ తీవ్ర వ్యత్యాసాలు కనిపించాయి. బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ (సీఏబీ)లో నమోదు చేసుకున్నప్పుడు అతని పుట్టిన సంవత్సరం 2007గా ఉంది. ఆ తర్వాత 2017, 2020లో చేసిన అప్‌డేట్స్‌లో 2006గా మారి, మళ్లీ 2021లో 2009గా మార్పు చెందినట్లు గుర్తించారు. ఈ తేడాల కారణంగానే, సీఏబీ అతడిని తమ జూనియర్ జట్లకు దూరంగా ఉంచి, విషయాన్ని బీసీసీఐ దృష్టికి తీసుకెళ్లింది. తాజాగా బీసీసీఐ రెండేళ్ల పాటు దేశవాళీ క్రికెట్‌లో పాల్గొనకుండా రోహిత్‌పై నిషేధం విధిస్తూ అన్ని రాష్ట్రాల క్రికెట్ సంఘాలకు సమాచారం ఇచ్చింది.

# ‘రంభ ఊర్వశి మేనక’- మూవీ రివ్యూ!

హాస్యకథానాయకుడిగా అనేక చిత్రాలను చేసిన అల్లరి నరేశ్, ఈ మధ్య కాలంలో కాస్త డిఫరెంట్ కాన్సెప్ట్ లను ట్రై చేస్తూ వెళుతున్నాడు. దాంతో ఆయన నుంచి మరో కామెడీ కంటెంట్ ఎప్పుడు వస్తుందా అని అభిమానులు వెయిట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన చేసిన మరో వినోదభరిత చిత్రమే ‘రంభ ఊర్వశి మేనక’. ఫాంటసీ టచ్ తో సాగే ఈ సినిమాకి చంద్రమోహన్ చింతాడ దర్శకత్వం వహించాడు. ఈ రోజునే థియేటర్లలో ఈ సినిమా విడుదలైంది. మరి ఈ సినిమా ఏ స్థాయిలో ఆడియన్స్ ను నవ్వించిందనేది చూద్దాం. సూరి (అల్లరి నరేశ్) ‘పెద్ద బాణాపురం’ అనే విలేజ్ లో తన తల్లితో కలిసి నివసిస్తూ ఉంటాడు. తన తండ్రికి సినిమా హీరో కావాలనే కోరిక ఉంటుంది. అయితే డ్రామా ఆర్టిస్ట్ గానే ఆయన మిగిలిపోవలసి వస్తుంది. దాంతో తాను సినిమా హీరో కావాలనే పట్టుదలతో సూరి ఉంటాడు. సూరి చిన్నప్పటి నుంచి ఆ ఇంట్లో ఒక మేజిక్ బుక్ ఉంటుంది. ఆ బుక్ లోని చుక్కలను సరైన పద్ధతిలో కలిపితే, ‘రంభ .. ఊర్వశి .. మేనక’ దిగివస్తారు. కోరిన కోరికలను నెరవేరుస్తారు అనే విషయం తన బాబాయ్ రమణ (సీనియర్ నరేశ్) ద్వారా తెలుసుకుంటాడు. అప్పటి నుంచి సూరి ఆ మేజిక్ బుక్ పై చుక్కలను అనేక రకాలుగా కలపడానికి ప్రయత్నిస్తూనే ఉంటాడు. రంభ .. ఊర్వశి .. మేనక దిగివస్తే, తనని సినిమా హీరోను చేయమని అడగాలనేది అతని ఉద్దేశం. ఏనాటికైనా అది జరుగుతుందనే నమ్మకంతో, ఏ పని చేయకుండా తల్లి కష్టంపై ఆధారపడి బ్రతుకుతుంటాడు. త్వరలో సినిమా స్టార్ ను అవుతాననే ఆశతో స్టేజ్ నాటకాలను కూడా పూర్తిగా పక్కన పెట్టేస్తాడు. రంభ .. ఊర్వశి .. మేనక విగ్రహాలను పూజిస్తూ వాళ్లు ప్రత్యక్షమయ్యే రోజు కోసం వెయిట్ చేస్తుంటాడు. ఎక్కడా ఏ పనీ చేయకుండా తిరుగుతూ ఉండటంతో, సూరికి అప్పులు పెరిగిపోతాయి. ఈ నేపథ్యంలోనే చిన్నీ (సురభి) సూరిని ప్రేమిస్తూ ఉంటుంది. అతను కూడా ఆమెను పెళ్లి చేసుకుందామని అనుకుంటాడు. అయితే నెల రోజుల్లో అప్పులన్నీ తీర్చేసుకుంటే తన కూతురునిచ్చి పెళ్లి చేస్తాననీ, లేదంటే పోలీస్ ఆఫీసర్ అప్పలనాయుడితో ఆమె వివాహం జరిపిస్తానని చిన్నీ తండ్రి తెగేసి చెబుతాడు. అసలే అప్పలనాయుడితో స్కూల్ డేస్ నుంచి గొడవలు ఉండటంతో సూరి ఆలోచనలో పడతాడు. సాధ్యమైనంత త్వరగా రంభ .. ఊర్వశి .. మేనకలను ప్రత్యక్షం చేసుకుని, తనని ఈ గండం నుంచి గట్టెక్కించమని కోరాలని సూరి నిర్ణయించుకుంటాడు. అదేసమయంలో అతని తల్లి ‘తులసమ్మ’కి ఒక సర్జరీ అవసరమవుతుంది. అందుకు 50 లక్షలు కావలసి వస్తుంది. ఉన్న అప్పులు తీర్చాలని అనుకుంటూ ఉండగా, కొత్తగా పెద్ద మొత్తంలో అప్పుచేయవలసి వస్తుంది. అప్పుడు సూరి ఏం చేస్తాడు? ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడు? రంభ ఊర్వశి మేనక అతని కోరికలు నెరవేరుస్తారా? చిన్నితో అతని పెళ్లి జరుగుతుందా? తన తల్లిని అతను బ్రతికించికోగలుగుతాడా? అనేది మిగతా కథ. సాధారణంగా దేవతలను ప్రత్యక్షం చేసుకునే మార్గం ఏదైనా ఉంటే, అందరూ ఆ మార్గాన్ని అనుసరించడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. తమ కోరికలను ఆ దేవతలు తప్పకుండా నెరవేర్చుతారని తెలిసినప్పుడు, తాము చేయవలసిన ఏ పనీ చేయకుండా ఆ రోజు కోసం వెయిట్ చేస్తుంటారు. ఈ కథలోని కథానాయకుడు కూడా అంతే. భారం మొత్తం అప్సరసలపై వేసి .. బద్దకంతో రోజులు గడిపేసే ఒక సూరి కథ ఇది. చిన్నప్పటి నుంచి మేజిక్ బుక్ పైనే ఆశలు పెట్టుకుని పెరిగిన సూరి, రంభ .. ఊర్వశి .. మేనకను ప్రత్యక్షం చేసుకోవడానికి చేసే ప్రయత్నాలతో ఫస్టాఫ్ నడుస్తుంది. బుక్ కారణంగా వాళ్లు భూలోకానికి రావడం .. తనకి చెప్పకుండా వెళ్లారనే కోపంతో దేవేంద్రుడు వాళ్లకి ఎలాంటి శక్తులు లేకుండా చేయడంతో కథ మరింత ఆసక్తికరంగా మారుతుంది. తిరిగి వెళ్లలేని అప్సరసలతో సూరి ఏం చేస్తాడు? అనే సందేహంతో కూడిన సన్నివేశాలతో సెకండాఫ్ కొనసాగుతుంది. ఉన్న అప్పులు తీర్చకపోతే ప్రేమించిన అమ్మాయి దక్కకుండా పోతుంది. కొత్తగా అప్పు చేయకపోతే కన్నతల్లి ప్రాణాలతో దక్కకుండా పోతుంది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న అప్సరసలు ప్రత్యక్షమైనా, వాళ్ల శక్తులన్నీ దేవేంద్రుడు అధీనంలో ఉంటాయి. ఇలాంటి పరిస్థితులలో తానున్న సమస్యలలో నుంచి ఒక సాధారణ యువకుడు ఎలా బయటపడతాడు? అనే ఒక ఉత్కంఠను రేకెత్తించడానికి దర్శకుడు తనవంతు ప్రయత్నం చేస్తూ వెళ్లాడు. ఒక వైపున దేవలోకంలో దేవేంద్రుడు .. మరో వైపున భూలోకంలో అప్సరసలు .. ఈ మధ్యలో అడపా దడపా వచ్చివెళ్లే యమధర్మరాజు హీరో సర్కిల్ ను టచ్ చేస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో వచ్చే సన్నివేశాలకు సాధ్యమైనంత వరకూ కామెడీని అద్దడానికి ప్రయత్నిస్తూ వెళ్లారు. బాహుబలి .. పోకిరి .. అవతార్ పోస్టర్ లపై హీరోగా అల్లరి నరేశ్ ను చూపించడం, రంభను లైన్లో పెట్టడానికి సీనియర్ నరేశ్ ట్రై చేయడం వంటి సన్నివేశాలు కొంతవరకూ నవ్వించగలుగుతాయి. అప్సరసలు రాగానే కోరికలన్నీ చెప్పడానికి ఒక చిట్టా తయారు చేయడం నవ్వు తెప్పిస్తుంది.




## అజిత్ అంజుమ్ విమర్శలకు సోనూసూద్ కూల్ రిప్లై!

ఇటీవల సంభవించిన తీవ్ర వరదలతో అల్లాడుతున్న నేపాల్ ప్రజలను ఆదుకునేందుకు ప్రముఖ నటుడు, రియల్ హీరో సోనూసూద్ రంగంలోకి దిగిన సంగతి తెలిసిందే. బాధితులకు అవసరమైన దుప్పట్లు, ఆహార పదార్థాలు, ఇతర నిత్యావసర సరుకులను భారత్ నుంచి తరలించి, క్షేత్రస్థాయిలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. అయితే, సోనూసూద్ నేపాల్ పర్యటనపై ప్రముఖ జర్నలిస్ట్ అజిత్ అంజుమ్ సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పించారు. పనులు ఇంకా ప్రారంభం కాకముందే ఆయనను దేవుడిగా చిత్రీకరిస్తూ ప్రచారం చేసుకోవడం కేవలం ‘సెల్ఫ్ మార్కెటింగ్’ అని ఎక్స్‌లో పోస్ట్ పెట్టడం కలకలం రేపింది. అయితే ఈ ప్రతికూల విమర్శలపై సోనూసూద్ ఎంతో హుందాగా, సానుకూలంగా స్పందించారు. “సోదరా.. మీ మనసు చాలా మంచిది. మీరు నేపాల్‌కు రండి, మనమిద్దరం కలిసి ప్రజలకు అండగా నిలబడి సాయం చేద్దాం” అంటూ రీట్వీట్ చేశారు. ఎలాంటి వివాదాలకు చోటు ఇవ్వకుండా, తనను విమర్శించిన వ్యక్తినే నేరుగా సేవా కార్యక్రమంలో భాగస్వామి కావాలని ఆహ్వానించిన ఆయన తీరు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. సోనూసూద్ చూపించిన ఈ సంస్కారం, పరిణతిపై సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది. కాగా, త్రిశూలి నది పరివాహక ప్రాంతాల్లో వరద విధ్వంసం తీవ్రంగా ఉందని, బాధితుల ఇళ్లను పునర్నిర్మించి వారు సాధారణ జీవితం గడిపే వరకు కొన్ని నెలల పాటు తమ ‘సూద్ ఫౌండేషన్’ తరఫున సహాయక చర్యలు కొనసాగుతాయని సోనూసూద్ స్పష్టం చేశారు. పరాయి దేశంలోనూ మానవత్వాన్ని చాటుకుంటూ ఆయన అందిస్తున్న సేవలకు గానూ అంతటా అభినందనలు వ్యక్తమవుతున్నాయి.



## ప్రస్తుత సినిమాలు, సెన్సార్ బోర్డు పనితీరుపై సుమన్ సంచలన వ్యాఖ్యలు

ప్రస్తుతం వస్తున్న సినిమాల తీరు, యువతపై వాటి ప్రభావం, సెన్సార్ బోర్డు పనితీరుపై టాలీవుడ్ సీనియర్ నటుడు సుమన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కొందరు నిర్మాతలు, దర్శకులు తీస్తున్న చిత్రాలు ప్రేక్షకులను, ముఖ్యంగా చిన్న పిల్లలను తప్పుదోవ పట్టించేలా ఉంటున్నాయని అన్నారు. అసలు సమాజానికి చెడు సందేశాన్ని ఇచ్చే ఇలాంటి సినిమాల విషయంలో సెన్సార్ బోర్డు ఏం చేస్తోందో, ఏ ప్రాతిపదికన అనుమతులు ఇస్తోందో అర్థం కావడం లేదని విమర్శించారు. సినిమా అనేది కుటుంబ సమేతంగా అందరూ కలిసి థియేటర్లకు వెళ్లి ఆనందంగా ఆస్వాదించేదిగా ఉండాలని, కానీ నేటి ట్రెండ్‌లో కుటుంబ సభ్యులు కలిసి చూడలేక విడివిడిగా వెళ్లి చూసే దుస్థితి రావడం బాధాకరమని సుమన్ అభిప్రాయపడ్డారు. ఇప్పటికే చిన్న పిల్లలు నిరంతరం చేతుల్లో స్మార్ట్‌ఫోన్లు పట్టుకుని, అందులో వచ్చే కంటెంట్ చూసి దారితప్పుతున్నారని, ఇలాంటి సమయంలో వస్తున్న కొన్ని వివాదాస్పద చిత్రాలు వారి ఆలోచనా విధానాన్ని మరింత పాడుచేస్తున్నాయని తెలిపారు. సినిమా అనేది సమాజాన్ని, ప్రజల భావజాలాన్ని సానుకూలంగా మార్చే అత్యంత శక్తివంతమైన సాధనమని సుమన్ గుర్తుచేశారు. ఒక వ్యక్తి ప్రవర్తనలో మంచి అలవాట్లు, క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించడానికి చలనచిత్ర రంగం ఎంతో అద్భుతంగా ఉపయోగపడుతుందని చెప్పారు. కొందరు కేవలం వ్యాపార దృక్పథంతో, లాభాలే ధ్యేయంగా సినిమాల పేరుతో సమాజాన్ని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా సినీ నిర్మాతలు, దర్శకులు కథలను ఎంచుకునేటప్పుడు ఎంతో బాధ్యతగా వ్యవహరించాలని, సమాజానికి మేలు చేసేలా, మంచి మెసేజ్ ఇచ్చే చిత్రాలను మాత్రమే రూపొందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.